# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 176 | విశాఖపట్నం | 28-3-2026 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 176 | VISAKHAPATNAM | 28-3-2026 SATURDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-




Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



2లో

### తుంగభద్ర నదిలో మునిగి నలుగురి మృతి





7లో

### తీవ్రమవుతున్న పెట్రోల్, డీజిల్ కొరత?



6లో

### సంతాన లేమికి కారణాలు ఏమిటి?



# భద్రాచలంలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవం

**భద్రాచలం, పతాకం న్యూస్:** భద్రాద్రి రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అభిజిత్ లగ్నంలో మిథిలా స్టేడియంలో సీతా సమేత శ్రీరామచంద్రుడి కళ్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీరాముడు సీతమ్మ తల్లిని మనువాడే అద్భుత ఘట్టాన్ని రామభక్తులు కనులారా తిలకించి తరించారు. సీతారాముల కల్యాణ వేడుకను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్చకుల వేదమంత్రాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య అభిజిత్ లగ్నంలో మాంగల్యధారణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గీత దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ కల్యాణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు భద్రాచలం ఆలయ అభివృద్ధికి తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. జగాలను ఏలిన జగదేకవీరుడికి జగన్మాత సీతమ్మకు అభిజిత్ లగ్నంలో జరిగిన కల్యాణ వేడుక కమనీయమంగా సాగింది. ఈ వైభవాన్ని కనులారా తిలకించి లోకమంతా పులకించిపోయింది. భద్రాచలం దివ్యక్షేత్రంలో భక్తకోటిని నయనానందకరం చేసింది. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు సాగిన కల్యాణ క్రతువులో ప్రతీఘట్టం ఆధ్యాత్మిక రస సాగరంలో ముంచెత్తింది. ప్రత్యేకంగా అలంకరించిన మిథిలా ప్రాంగణంలో తొలుత తిరు కల్యాణానికి సంకల్పం పలికి సర్వ విఘ్నాన శాంతికి ఆరాధన చేపట్టారు.

కళ్యాణానికి ఉపయోగించే సామాగ్రిని సంప్రోక్షణ చేసిన తర్వాత రక్షా బంధనం నిర్వహించి యోకర్తధారణ చేశారు. ఇరు వంశాల గోత్రాలు పఠించి స్వామివారి పాద ప్రక్షాళన చేసి మహాదానాలు సమర్పించారు. వేద మంత్రోచ్చరణలు మార్మోగుతుండగా అభిజిత్ లగ్నం సమీపించగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సుపై ఉంచారు. ఈ సమయాన్ని శుభ ముహూర్తమని జగత్ కల్యాణ శుభ సన్నివేశంగా కీర్తిస్తారు. రాముడి దోసిట తలంబ్రాలు నీలపు రాసులవుతుంటే జానకి దోసిట తలంబ్రాలు కెంపులయ్యాయి.

తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భద్రాచలం వచ్చిన భక్త జనానికి ఎలాంటి అసౌర్యం లేకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌర్యం లేకుండా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ప్రత్యేకంగా సెక్టార్లు ఏర్పాట్లు చేసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎండ నుంచి ఉపశమనం కలిగేలా చలువ పందిళ్లు వేశారు. భక్తుల తాకిడి పెరుగుతుండటం, ప్రముఖుల రాక ఎక్కువ ఉండటంతో దాదాపు 2 వేల మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాల్లో చివరి ఘట్టమైన శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవం శనివారం జరగనుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి స్వామి వారి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. కల్యాణం అనంతరం ప్రముఖులకు వేద పండితులు స్వామివారి గోటి తలంబ్రాలు అందజేశారు.

## పీఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతం చేయాలి: గొట్టిపాటి



**అమరావతి, పతాకం న్యూస్:** డిస్కంల సీఎండీలతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పీఎం సూర్య ఘర్, ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై సీఎండీలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎండీలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రణాళికాబద్ధంగా పీఎం సూర్యఘర్ కనెక్షన్లను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా అందించే పీఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతంగా చేపట్టాలని మంత్రి తెలిపారు.



2లో

### తగ్గింపు కంపెనీలకే... నియోగదారులకు కాదు: చమురు ధరలపై స్పష్టత ఇచ్చిన కేంద్రం

## బస్సు ప్రమాద బాధితులను పరామర్శించిన ఏపీ మంత్రులు



**ప్రకాశం, పతాకం న్యూస్:** మార్కాపురం మండలం రాయవరం ప్రమాద బాధితులను ఆంధ్రప్రదేశ్ మంత్రులు బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పరామర్శించారు. ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చికిత్సపొందుతున్న బాధితులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని.. ఎవ్వరూ అధైర్య పడొద్దని బాధిత కుటుంబాలకు మంత్రులు హామీ ఇచ్చారు. పరామర్శ అనంతరం మంత్రులిద్దరూ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. 'మార్కాపురంలో బస్సు ప్రమాద ఘటన దిగ్భ్రాంతికి గురి చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. హోమ్ మినిస్టర్ అనిత, రవాణా శాఖ మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డిని ఘటనా స్థలానికి పంపారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం వెంటనే స్పందించారు.



5లో

### ప్రయాణికుల ప్రయాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు?



7లో

### నేటి నుంచి ఐపీఎల్ సీజన్-19 ప్రారంభం


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## వాస్తవాలు!

ఒక్కసారి దళిత కులాల్లో పుట్టిన తరువాత, నిజానికి తల్లి కడుపులో జీవం పోసుకోగానే ప్రారంభమయ్యే వివక్ష చనిపోయేంత వరకు, ఆ మాటకొస్తే ప్రాణాలు విడిచిన తరువాత కూడా వెంటాడుతూనే ఉంటుంది. ఆ వ్యక్తి ఎంత విజ్ఞానం పొందినా, ఏ హోదాకు ఎదిగినా, ఎంత ఆస్తి సంపాదించినా, చివరకు మతం మారినా వేయి పడగల విషనాగు విషం చిమ్ముతూనే ఉంటుంది. ఏ మాత్రం అవకాశం దొరికినా కాటు వేయడానికి పొంచే ఉంటుంది! మేధో సంపన్నులు, అత్యున్నత పదవుల్లో ఉన్న వారు సైతం వివక్షకు గురైన సందర్భాలు కోకొల్లలు! క్షేత్ర స్థాయిలో అడుగడుగునా కనిపించే ఈ వాస్తవాలను విస్మరించిన ఫలితమే దళిత క్రిస్టియన్ల విషయమై సుప్రీంకోర్టు ఇచ్చిన తాజా తీర్పు! హిందువులు, సిక్కులు, బౌద్ధులు కాకుండా వేరే మతాన్ని అనుసరించే ఏ వ్యక్తినైనా షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారిగా గుర్తించలేమని, మతం మారిన మరుక్షణమే షెడ్యూల్ కుల గుర్తింపు కోల్పోతారంటూ అత్యున్నత న్యాయస్థానం తీర్పు చెప్పడం దురదృష్టకరం! మతం మారిన తరువాత కూడా కుల గజ్జితో వెంటాడే మనువు మానస పుత్రులపై ఝుళిపించాల్సిన కొరడాను బాధాసర్వద్రష్టుల పైనే ప్రయోగించడం ఎంత వరకు సబబు? హిందూ మతంలో తమపై చోటుచేసుకుంటున్న అమానుష హింస నుండి తప్పించుకోవడానికే అనేక నిమ్నకుల సమూహాలు మతం మారిన, మారుతున్న మాట ఎంత వాస్తవమో, కుల రక్కసి అక్కడ కూడా వెంటాడుతున్న మాట అంతే వాస్తవం. దీనికి వారు ఏ మత సాంప్రదాయాన్ని అనుసరిస్తున్నారన్నది కాదు. దళితులుగా పుట్టారన్నదే కారణం. ఈ వాస్తవాన్ని ధర్మాసనం ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. ఈ విష సంస్కృతి నుండి తప్పించుకోవడానికే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ హిందూ మతం నుండి బౌద్ధంలోకి మారారు. తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలిస్తే ఆ బౌద్ధంలో కూడా కుల రక్కసి కాళ్లూనుకుందని, రంకెలేస్తోందని అర్థమౌతోంది. అదే సమయంలో అత్యున్నత ఇతర మతాల్లోనూ చోటుచేసుకున్న అదే పరిణామాన్ని గుర్తించడానికి నిరాకరించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని తమ కన్ను సన్నలలో నడిపించే సంఘ్పరివారం ఇదే వైఖరితో ఉంది. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, ఇతర సౌకర్యాలను దళిత క్రిస్టియన్లు పొందడాన్ని వ్యతిరేకించడంతో పాటు, వారిపైకి అగ్రకులస్తులను రెచ్చగొట్టడానికి ఏళ్ల తరబడి ప్రయత్నిస్తోంది. తాజా తీర్పు అటువంటి మతోన్మాద శక్తులకు ఊతంగా మారే ప్రమాదం ఉంది. అమెరికాలో భారతీయులు ఎక్కువగా నివసించే కాలిఫోర్నియా, సియాటెల్ నగరాల్లో కుల వివక్షను నిషేధిస్తూ చట్టాలు చేశారు.బ్రిటన్లోనూ సమానత్వ చట్టంలో కులాన్ని చేర్చారు. కెనడా కూడా కుల వివక్షను నిషేధిస్తూ చట్టం చేసింది. ఒక దేశం తరువాత మరో దేశం ఈ దురాగతంపై సమరం చేయడానికి సిద్ధమౌతుంటే మన న్యాయస్థానాలు ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకోవడం పోయి, దానికి భిన్నంగా స్పందించడం దారుణం. నేరాలకు,ఘోరాలకు, అఘాయిత్యాలకు, అత్యాచారాలకు దేశ వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో బలవుతున్నది ఎవరో, వారిపై ఆ దారుణాలకు తెగబడుతున్నదెవరో సర్కారీ రికార్డులు ఒక్కసారి పరిశీలిస్తే అర్థమవుతుంది. మతం మారినంత మాత్రాన ఈ దురాగతాలన్నీ అంతం అవుతాయనో, మారారు కాబట్టి జరిగినా ఫర్లేదనో భావించడం దారుణం. కులం అన్నది పుట్టుకతో వచ్చే, ఒక సామాజిక, ఆర్థిక దుస్థితి! మతం మారినంత మాత్రాన ఆ దుస్థితి పోదు. దీనిని దృష్టిలో ఉంచుకునే రాజ్యాంగ నిర్మాతలు రిజర్వేషన్లు, ఇతర రక్షణ చర్యలను రూపొందించారు. ఎస్సి జాబితాలో ఉన్నవారందరూ ఏదో రూపంలో వివక్షకూ, అంటరానితనానికి, వేధింపులకు గురవుతూనే ఉన్నారు. ఏ మతంలోకి మారినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అవి కొనసాగుతూనే ఉండటం మన కళ్ల ముందే ఉంది. ఈ సామాజిక, ఆర్థికాంశాలను పట్టించుకోకుండా, మత పరమైన గుర్తింపునకే సుప్రీం కోర్టు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనపడుతోంది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి, రిజర్వేషన్ల లక్ష్యాలకు విరుద్ధం! తక్షణమే కేంద్రం, రాష్ట్రాలు స్పందించాలి. మతంతో సంబంధం లేకుండా ఎస్సిలందరికీ రాజ్యాంగం నిర్దేశించిన ప్రయోజనాలు కొనసాగేలా తీసుకోవాలి. అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలను కూడా చేయాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించేందుకు రాజ్యాంగ బెంచ్కు అప్పగించాలి.

## తుంగభద్ర నదిలో మునిగి
# నలుగురి మృతి



**తుంగభద్ర, పతాకం న్యూస్:** తుంగభద్ర నదిలో స్నానానికి దిగి నలుగురు మృతి చెందిన దుర్ఘటన శుక్రవారం కర్నూలు జిల్లా కోసిగి ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద జరిగింది. పెండ్లి వేడుకలో పాల్గొనడానికి కర్నాటకలోని మాన్వికి చెందిన 15 మంది రెండు రోజుల క్రితం కందుకూరు గ్రామానికి వచ్చారు. వివాహం ముగిసిన తర్వాత ఈరోజు ఉదయం వారంతా సరదాగా తుంగభద్ర నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో దిగిన నలుగురు ఈత రాకపోవడంతో నీటమునిగి మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బాలుడి కిడ్నాప్ హత్య కేసులో.. కాల్పులు జరిపి నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



**అనంతపురం, పతాకం న్యూస్:** బాలుడి కిడ్నాప్ హత్య కేసు ఘటనలో నిందితుడు పారిపోతుండగా, కాల్పులు జరిపిన తాడిపత్రి పోలీసులు అతడిని శుక్రవారం అరెస్టు చేశారు. తాడిపత్రి నియోజకవర్గం యాడికి పోలీస్ స్టేషన్ పరిధిలో నిన్న బాలుడి కిడ్నాప్, హత్య ఘటన కలకలం రేపింది. సర్వేశ్ కుమార్ అనే వ్యక్తి కుందన కోట గ్రామం వద్ద బాలుడి గొంతు నులిమి, రాయితో కొట్టి కిరాతకంగా హత్య చేశాడు. ఈ కేసులో నిందితుడు పోలీసుల పై దాడి చేసి తప్పించుకుని పారిపోతుండగా పోలీసులు కాల్పులు జరిపారు. నేరం జరిగిన చోటును పోలీసులు పరిశీలిస్తుండగా ఖాళీ బీర్ బాటిల్ తో పోలీసుల పై నిందితుడు దాడి చేశాడు. బీర్ బాటిల్ తో నిందితుడు చేసిన దాడిలో పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య, కానిస్టేబుల్ వెంకటేష్లకు గాయాలయ్యాయి. ఆత్మరక్షణ కోసం నిందితుడి పై పెద్దవడుగూరు సీఐ రామసుబ్బయ్య నాలుగు సార్లు కాల్పులు జరిపారు. నిందితుడి కాళ్ళకు బుల్లెట్ లు తగిలి కింద పడిపోవడంతో పోలీసులకు దొరికాడు. తాడిపత్రి ఆస్పత్రిలో గాయపడిన పోలీసులకు, నిందితుడికి చికిత్స అందుతోంది.

## 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు: స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశంలోని 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ తాజాగా వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించినట్లు వెల్లడించింది. తరుచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొంది. 2025 జనవరి నుంచి 2026 ఫిబ్రవరి వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా 377 వాటిల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపింది. ఆడిట్ చేసిన వాటిల్లో ఇండిగో విమానాల సంఖ్య ఎక్కువగా ఉందని, లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నట్లు కమిటీ తెలిపింది. ఫిబ్రవరి 3వ తేదీ వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా, 148 ఫ్లైట్లలో లోపాలు ఉన్నాయని తెలిపింది. కొన్ని లోపాలు రిపీట్ అయినట్లు పేర్కొంది. 166 ఎయిరిండియా, 101 ఎయిరిండియా ఎక్స్ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టగా, వాటిలోనూ లోపాలు వెలుగుచూశాయి.దాదాపు సగం లోపాలు ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నట్లు తెలిపింది. ఈ స్థాయిలో లోపాలు వెలుగుచూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గత సంవత్సరం అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్ను కూడా నివేదిక ప్రస్తావించింది.

## వ్యాపారవేత్తలుగా వడ్డెర్లు: మంత్రి సవిత



**అమరావతి, పతాకం న్యూస్:** నూతన వడ్డెర సొసైటీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి సవిత తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. వడ్డెర్లకు ఇచ్చిన హామీలను మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారన్నారు. వడ్డెర్ల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబులక్ష్యమని.. వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని సీఎం సంకల్పించారని మంత్రి సవిత వెల్లడించారు. కూటమితోనే వడ్డెర్లకు ఆర్థిక, సామాజిక గుర్తింపు అని మంత్రి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మైనింగ్ లీజుల్లో వడ్డెర సొసైటీలకు 15 శాతం కేటాయింపు చేయనున్నట్లు తెలిపారు. సీనరేజీలో 50 శాతం మినహాయింపు కల్పించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర పండుగగా వడ్డె ఓబన్న జయంతిని నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. మైనింగ్ లీజుల్లో రిజర్వేషన్ల కేటాయింపు, 50 శాతం సీనరేజీ మినహాయింపు చర్యలపై వడ్డెర కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవితకు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు, డైరెక్టర్లు ధన్యవాదాలు తెలిపారు. అలాగే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు వడ్డెర్లు పాలాభిషేకం చేశారు.

## నేడు ప్రధాని చేతుల మీదుగా నోయిడా ఎయిర్పోర్ట్ ప్రారంభం: రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతానికి శనివారం నుంచి రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుందని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించనున్నారని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు కేంద్రమంత్రి. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. 'శనివారం జేవార్ వద్ద మీ అందరినీ కలుస్తా' అంటూ రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కాగా, దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీంతో ఈ ప్రాంతాల్లో మరో నూతన అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మించాలని భావించింది. ఈ మేరకు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం జేవార్లో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసింది. అత్యాధునిక టెక్నాలజీ, హంగులతో దీన్ని నిర్మించారు. మార్చి 28న జేవార్లో ప్రారంభోత్సవానికి తేదీ సైతం ఖరారు చేశారు. ఈ కొత్త విమానాశ్రయం దేశ విమానాశ్రయ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## వైసీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి వేడుకలు



**తాడేపల్లి, పతాకం న్యూస్:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైసీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మల్లాది విష్ణు, జడ్పీ చైర్పర్సన్ ఉప్పాల హారిక, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, వైసీపీ అధినేత జగన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. "ఇచ్చిన మాట కోసం రాజ్యాన్ని త్యజించి, ఎన్ని కష్టాలు ఎదురైనా ధర్మాన్ని వీడని మహోన్నతుడు శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడు. ఆ సకల గుణాభిరాముడి దివ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఎక్స్ వేదికగా ఆయన శ్రీరామనవమి సందేశాన్ని ఇచ్చారు.

## తగ్గింపు కంపెనీలకే... వినియోగదారులకు కాదు: చమురు ధరలపై స్పష్టత ఇచ్చిన కేంద్రం




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వాహనదారులకు పెట్రోల్, డీజిల్ ధరల విషయంలో ఎలాంటి ఊరట లభించలేదు. పెట్రోల్, డీజిల్పై లీటర్కు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. అయితే, ఈ తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు చేరదని, రిటైల్ ధరలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఎదుర్కొంటున్న భారీ నష్టాలను భర్తీ చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుత అంతర్జాతీయ ధరల ప్రకారం, ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి సంస్థలు లీటర్ పెట్రోల్పై సుమారు రూ. 26, లీటర్ డీజిల్పై రూ. 81.90 చొప్పున నష్టపోతున్నాయి. ఈ కంపెనీలు రోజుకు మొత్తంగా రూ. 2,400 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని మంత్రిత్వ శాఖ వివరించింది. తాజాగా తగ్గించిన రూ.10 ఎక్సైజ్ సుంకం ఈ నష్టాల్లో కొంత భాగాన్ని భర్తీ చేస్తుందని, దీనివల్ల సరఫరాకు అంతరాయం కలగకుండా చూసుకోవచ్చని పేర్కొంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గత నెల రోజుల్లోనే అంతర్జాతీయంగా ముడి చమురు ధర బ్యారెల్కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు (దాదాపు 75 శాతం పెరుగుదల) పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇంధన ధరలు 20 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగినా, భారత్లో మాత్రం ధరలను స్థిరంగా ఉంచామని పేర్కొంది. సామాన్య పౌరులను కాపాడేందుకే ప్రధాని మోదీ ప్రభుత్వ ఆదాయాన్ని వదులుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. ఇదే సమయంలో, డీజిల్ ఎగుమతులపై ప్రభుత్వం కొత్తగా సుంకాన్ని విధించింది. అంతర్జాతీయంగా ధరలు పెరిగిన నేపథ్యంలో, ఎగుమతులను నిరుత్సాహపరిచి, దేశీయ అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రపంచ ఇంధన పరిస్థితిని నిశితంగా గమనిస్తూ, వినియోగదారులకు సరఫరా, ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్రం హామీ ఇచ్చింది.

# పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు: కేతన్‌గార్గ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పారిశుధ్యనిర్వహణలో నిర్లక్ష్యం తగదని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 11,12 వార్డుల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల హాజరును మొబైల్‌యాప్‌లో పరిశీలించి సూచనలు చేశారు. ఆరిలోవ విశ్వవిజ్ఞాన విద్యాలయం ప్రైవేట్ స్కూల్ ప్రాంగణంలో చాలా ప్రదేశం ఉన్నప్పటికీ, కాలువపై ప్లాస్టిక్ డబ్బా పెట్టి వ్యర్థాలు వేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, అపరాధ రుసుం వేయాలని ఆదేశించారు. పలువురు దుకాణదారులు కాలువల్లోనే వ్యర్థాలు వేస్తుండడాన్ని గమనించి, వారికీ ఫైన్ వేయాలని ఆదేశించారు. చెత్తసేకరణ, పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరిలోవ చివరి బస్‌స్టాప్ వద్ద కల్యాణమండపం పనుల అలసత్వంపై అసహనం వ్యక్తం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆస్తి పన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ గడువు నెలాఖరుతో ముగుస్తున్నందున ఈ లోగా లక్ష్యాలను పూర్తి చేయాలని జెడ్‌సి బి.రామును ఆదేశించారు. రోడ్ల అభివద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ సంబంధితఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మధురవాడ జోన్ 6, 8 వార్డుల పరిధిలోని పోతిన మల్లయ్య పాలెం, వికలాంగుల కాలనీలో రహదారుల అభివృద్ధికి ప్రతిపాదించిన ప్రాంతాలను జెడ్‌సి ఇప్పి నాయుడుతో కలిసి పరిశీలించారు. ఆరవ వార్డు పీఎం పాలెం నుండి సాయిబాబా గుడి వరకు 20 అడుగుల రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగించి, 60 అడుగుల రోడ్డు విస్తరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఎనిమిదోవార్డు వికలాంగుల కాలనీలో ప్రతిపాదిత రిటైనింగ్ వాల్‌కు బదులుగా 250 మీటర్లలో 15 అడుగుల రోడ్డుతో పాటు కాలువలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కాలనీ వాసులు తన దృష్టికి తెచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా కాలువలు, వీధులు, రోడ్లు నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు.


## భారతీయ జ్ఞాన వ్యవస్థ కీలక పాత్ర: భాగ్యలక్ష్మి





**మల్కాపురం, పతాకం న్యూస్:** సుస్థిర వృద్ధికి,స్వయం సమృద్ధికి,సాంస్కృతిక వైభవానికి భారతీయ జ్ఞాన వ్యవస్థ ఎంతో అవసరమని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు.స్థానిక సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాలలో "ఆధునిక సమాజంలో భారతీయ జ్ఞాన వ్యవస్థ పాత్ర" పై గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రాంతీయ సదస్సులో ఆమె ప్రసంగిస్తూ- విద్యారంగంలో, పర్యావరణ పరిరక్షణలో, గణిత- ఖగోళ శాస్త్రాల్లో భారతీయ జ్ఞాన వ్యవస్థ కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. సంగీతం, సాహిత్యం,నాట్యం,గానం, శిల్పం వంటి లలిత కళలను అభ్యసించడంలో భారతీయ జ్ఞాన శాస్త్రం ఒక పునాదిగా పనిచేస్తుందని అన్నారు. హస్త కళలు, ఆయుర్వేద ఉత్పత్తులు మొదలైనవి మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాలకు దోహదపడుతున్నాయని అన్నారు. అనంతరం డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులు- వివిధ అంశాలలో భారతీయ జ్ఞాన వ్యవస్థ పాత్రను తెలుపుతూ అనేక అధ్యయన పత్రాలను సమర్పించారు. సదస్సులో భాగంగా చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై. అనసూయదేవి నిర్వహించారు.ఈ సదస్సులో పాల్గొన్న వారిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు.

## జీవం ఉన్న పంటలతో సబల భోజనాల పండుగ




**సింహాచలం, పతాకం న్యూస్:** జీవం ఉన్న పంటలతో సబల భోజనాల పండుగ నిర్వహిస్తున్నామని ఎపి నర్సరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల చలపతి రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల లో "సబల భోజనాల పండుగ" కోసం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగుతోంది అన్నారు. ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం అవసరం అన్నారు. ప్రధానంగా ప్రకృతి పంటలే ఆరోగ్యకరం, ఆనంద దాయకం అని వివరించారు. అలాంటి జీవం ఉన్న పంటలతో మన పూర్వీకులు వంటలు ఎలా చేసుకున్నారో అలాంటి రుచి కరమైన, సుచికరమైన, ఆరోగ్యకరమైన వంటలు వండటం, భుజించడం, అవగాహన కలిగించడం కోసం ఏప్రిల్ 1 నుంచి 5 వ తేదీ వరకూ సభలో భోజనాలు పండుగ నిర్వహించడం జరిగుతోంది అన్నారు. ఈ కార్యక్రమంలో తులసి నేచురల్స్ సత్యనారాయణ మాట్లాడుతూ సబల భోజనాలు పండుగలలో ఉత్తరాంధ్ర సాంస్కృతిక కళల ప్రదర్శన నిర్వహించడం జరిగుతోంది అన్నారు. అలాగే పాత ఇత్తడి, మట్టి పాత్రలలో వంటడం జరుగుతుంది అని వివరించారు. జన్యుమార్పిడి పంటలు వద్దే వద్దు అన్నారు. మనం మన సాంస్కృతిని, కళలను కాపాడుకోవాలి అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు ఎం ఆర్ ఎన్ వర్మ మాట్లాడుతూ ప్రతి జర్నలిస్టు ఈ సబల భోజనాలు పండుగలలో పాల్గొనాలని, జయప్రదం చేయాలని, విస్తారంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ప్రకృతి రైతు గుంటూరు జగన్నాద రాజు, మేంగొ మేన్ అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

## కేజీహెచ్‌లో అందుబాటులోకి రానున్న క్రిటికల్ కేర్ భవనం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అత్యవసర పరిస్థితుల్లో కెజిహెచ్‌కు వచ్చే రోగులకు ఇకపై మెరుగైన సేవలు అందనున్నాయి. ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన ఈ ఆసుపత్రిలో త్వరలో అధునాతన సౌకర్యాలతో క్రిటికల్ కేర్ భవనం అందుబాటులోకి రానుంది. ఆయుష్మాన్ మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ బ్లాక్‌లను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ పరిధిలోగల కెజిహెచ్‌కు రూ.7.12 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలు కొనుగోలు చేయాలని సూచించింది. కెజిహెచ్ మార్చురీ ఎదుట కొద్ది నెలల కిందట రూ.23.75 కోట్లతో ప్రారంభమైన క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఐదు అంతస్తులతో దీనిని నిర్మించారు. ప్రస్తుతం ఆసుపత్రి అధికారులు పరికరాల కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు. వచ్చే నెలాఖరు నాటికి రెండో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. కొత్తగా ప్రారంభించబోయే బ్లాక్‌లో 50 పడకలు అందుబాటులో ఉంటాయి. ఒక్కో విభాగానికి 2 నుంచి 10 చొప్పున కేటాయించారు. అత్యవసర కేసులు అధికంగా వచ్చేందుకు అవకాశం ఉన్న అత్యవసర విభాగం, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, పిడియాట్రిక్స్, గైనిక్ వంటి విభాగాలకు పడకలు కేటాయిస్తున్నారు. సుమారు 50 మంది నర్సింగ్ సిబ్బంది అవసరమవుతారని అదికారులు అంచనా వేశారు. ప్రస్తుతం కెజిహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది కొరత ఉన్న దృష్ట్యా ఈ బ్లాక్ కోసం కొత్తవారిని తీసుకోవాలని భావిస్తూ ఆ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. ఒకేచోట వైద్యం అందేలా..ప్రస్తుతం కెజిహెచ్‌లో అత్యవసర పరిస్థితుల్లో చేరే రోగులకు వివిధ విభాగాల్లో వైద్యం అందిస్తున్నారు. పరిస్థితిని బట్టి రోగులను ఆయా విభాగాలకు తరలిస్తున్నారు. కొత్తగా నిర్మించిన ఈ బ్లాక్ అందుబాటులో వచ్చిన తర్వాత ఏ విభాగానికి చెందిన వారైనా, అత్యవసర స్థితిలో ఉంటే, ఇక్కడే చేర్చి వైద్యం అందించాలని భావిస్తున్నారు. 24 గంటలూ నిపుణులైన వైద్యులు, సిబ్బంది ఇక్కడ అందుబాటులో ఉంటారు. రోడ్డు ప్రమాదాలు, బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్ బాధితులకు, పాముకాటు, శ్వాసకోశ సంబంధ సమస్యలు, తీవ్రమైన గాయాలు అయిన వారికి కొత్త బ్లాక్‌లో వైద్య సేవలు అందించాలని భావిస్తున్నారు. ఈ కొత్త బ్లాకు సేవల నిమిత్తం అత్యాధునిక వెంటిలేటర్లు, ఇతర ఐసియు పరికరాలు, పరీక్షలు నిర్వహించే మెషిన్లు కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఇక్కడ నుంచి మరొక చోటుకు రోగిని తరలించాల్సిన అవసరం లేకుండా, అన్ని పరీక్షలూ నిర్వహించేలా ఈ విభాగాన్ని శరవేగంగా తీర్చిదిద్దుతున్నారు. కెజిహెచ్‌లో మరొక కీలకమైన కేంద్రంగా క్రిటికల్ కేర్ బ్లాక్ నిలుస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు.

## మార్కెట్ తరలింపుపై గందరగోళం



**ఆరిలోవ, పతాకం న్యూస్:** వేములవలస గ్రామ పంచాయతీ పరిధిలోని మహాత్మా గాంధీ రోజువారీ మార్కెట్‌ను వేరే ప్రాంతానికి తరలించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రకటించిన నేపథ్యంలో ఆశీలు కాంట్రాక్టర్లు, వ్యాపారుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నెల 23న మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్, మార్కెట్ సమీపంలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని వేరేచోటుకు తరలింపుపై సంబంధిత పంచాయతీ అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు 1998లో జిల్లా కలెక్టర్ ద్వారా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటై, వేములవలస పంచాయతీ పరిధిలో ఇప్పటివరకు విజయవంతంగా నిర్వహిస్తున్న మార్కెట్‌తో స్థానిక రైతులు, వ్యాపారులకు ముఖ్య వాణిజ్య కేంద్రంగా కొనసాగుతోంది. ఈనెల 25న మార్కెట్‌లో ఆశీలు వసూలుకు వేలం వేయాల్సి ఉండగా, అనివార్య కారణాలతో ఈనెల 28కి వాయిదా వేశారు. మార్కెట్ తరలింపుపై స్పష్టత లేకుండా వేలం నిర్వహణపై కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వ్యవహారం కొలిక్కి వచ్చేవరకు వేలంపాటను వాయిదా వేయాలని కోరుతున్నారు.

## లయన్స్ ఆసుపత్రికి విరాళం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** లయన్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో క్లినికల్ ల్యాబ్ అభివృద్ధి, రోగులకు ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో ఆటోమేటెడ్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్ కొనుగోలుకు ఎన్వేద థెరప్యూటిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సామాజిక బాధ్యతగా సంస్థ డైరక్టర్ లయన్ సిఎస్‌ఎస్‌పి కృష్ణారావు రూ.4.59లక్షల విరాళాన్ని ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావుకు అందజేశారు. అమెరికాలో ప్రధాన కార్యాలయం కలిగిన 'ఎన్వేద బయో సైన్సెస్'? అనే ప్రధాన సంస్థతో విశాఖకు చెందిన డాక్టర్ విశ్వతేజ కొల్లూరు ఆరేళ్ల క్రితం స్టార్టప్ సంస్థను స్థాపించారు.కొత్త అణువులు ఔషధాలపై పరిశోధన చేసే ఈ సంస్థ వ్యవస్థాపకుడు, సిఇఒగా ఉన్న డాక్టర్ విశ్వతేజ, ఇండియాలో ఆ సంస్థ డైరెక్టర్, తన తండ్రి లయన్ సిఎస్‌ఎస్‌పి కృష్ణారావు ద్వారా ఈ విరాళం అందించారు. విరాళ దాతలకు లయన్స్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

## సైబర్ సెక్యూరిటీపై ముగిసిన వర్క్‌షాప్



**మధురవాడ, పతాకం న్యూస్:** గీతం వర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'ప్రొటెక్టింగ్ డిజిటల్ అసెట్స్ ప్రాక్టికల్ అప్రోచ్ టు సైబర్ థ్రెట్స్' అంశంపై నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ముగిసింది. ఆధునిక సైబర్ ముప్పు, భద్రతా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.ఉమాదేవి పర్యవేక్షణలో డాక్టర్ ఎమ్.శేషసాయి, ఎం..సురేష్‌కుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వర్క్‌షాప్‌లో కాగ్నిటివ్ కేర్ ఇండియా ల్యాబ్స్ చీఫ్, డేటా సైంటిస్ట్ డాక్టర్ ఎన్.సురేష్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ ప్రాథమిక అంశాలైన సిఐఎ ట్రైయాడ్, మాల్వేర్ రకాలు, నెట్‌వర్క్ సెక్యూరిటీ టూల్స్ గురించి వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషిన్ లెర్నింగ్ రంగంలో సైబర్ సెక్యూరిటీ ప్రాధాన్యతను తెలిపారు. టిసిఎస్ డెలివరీ మేనేజర్ మిస్టర్ కొల్లా ప్రతాప్ విద్యార్థులకు క్రిప్టోగ్రఫీ, హ్యాషింగ్, డిజిటెల్ సిగేచర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వర్చువల్ బాక్స్, ట్రైహ్యాక్ మీ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సోషల్ ఇంజనీరింగ్, ఫిషింగ్, రాన్సమ్ వేర్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్‌లో తలెత్తే సెక్యూరిటీ సవాళ్లపై చర్చించారు. బాండిట్, గండాల్ఫ్‌లకేరా వంటి లినక్స్ ద్వారా విద్యార్థులకు నైపుణ్యాలను నేర్పించారు. ఈ వర్క్‌షాప్ విద్యార్థులకు సిద్ధాంతిక అంశాలతో పాటు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడంలో ఎంతగానో దోహదపడింది. సీనియర్ ప్రొఫెసర్ కె.వేదవతి పాల్గొన్నారు.

## విమ్స్ ఆసుపత్రి సెక్యూరిటీ గార్డ్‌ల నిరసన



**ఆరిలోవ, పతాకం న్యూస్:** విమ్స్ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల వేతన బకాయి చెల్లించాలని ప్రభుత్వ హాస్పిటల్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు డిమాండ్ చేసారు. సిఐటియు ఆధ్వర్యంలో విమ్స్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డులు విధులను బహిష్కరించి, ఆసుపత్రి ఆవరణలో నిరసన చేపట్టారు. పెండింగ్ జీతాలను చెల్లించాలని, నెలసరి వేతనాలు సక్రమంగా చెల్లించాలని నిరసన నినాదాలు చేశారు.ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో విమ్స్ ఆసుపత్రిలో 22 మంది గార్డులు పనిచేస్తున్నా వారికి సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. ఇలాగైతే వారి కుటుంబపోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. వెంటనే వేతన బకాయి చెల్లింపుతోపాటు జిఒ 138 ప్రకారం ప్రతినెలా పదోతేదీలోపు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందరికీ ఇఎస్‌ఐ పత్రాలను ఇవ్వాలన్నారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబుకు వినతిపత్రం అందజేయగా, ఆయన వెంటనే స్పందించి, సంబంధిత కాంట్రాక్టర్స్‌తో మాట్లాడి, వెంటనే జనవరి నెల వేతనం చెల్లించేలా, మిగతా బకాయి వచ్చేనెలలో వేసేలా సూచించారు. సమస్య పరిష్కరించిన విమ్స డైరెక్టర్ డాక్టర్ రాంబాబుకు సెక్యూరిటీ గార్డులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్య, కార్యదర్శులు వరలకీ, అప్పలరాజు, కోశాధికారి ఉమా, గౌరవ అధ్యక్షులు ఆర్.తిరుపతి, గురునాధరావు, ఎం.సుశీల పాల్గొన్నారు.

## క్వారీ ఏర్పాటు చేయొద్దని ఫిర్యాదు

**పద్మనాభం, పతాకం న్యూస్:** మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీ భద్రయ్యపేట సమీపంలో 294, 295, 296 సర్వే నెంబర్లలో ఎటువంటి క్వారీలకు అనుమతి ఇవ్వొద్దని స్థానిక యువకులు కోరారు. ఎంపిడిఒ వి.నగేష్, డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్‌లకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే ఉన్న క్వారీలతో ఆయా గ్రామాల్లో కిడ్నీ సంబంధిత సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారని, క్వారీలు కాలుష్యంతో ప్రజలు బతకలేని దుస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాక తమకు జీవనాధారమైన భూముల్లో మూడు క్వారీ ఏర్పాటు చేస్తే ఎలా బతికేదని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ క్వారీలకు అనుమతులు ఇవ్వొద్దని, ఇస్తే అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో పి అప్పలరాజు,ఈ లక్ష్మణరావు, ఎ.కృష్ణ పాల్గొన్నారు,

## కుదులైన టమోటా రైతులు



**వీరఘట్టం, పతాకం న్యూస్:** వీరఘట్టం ప్రాంతం కూరగాయలకు ప్రసిద్ధి. అయితే పండించిన కూరగాయలకు మద్దతు ధర లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాల వల్ల సాగు చేసే రైతులు అప్పులు ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ఏడాది టమోటా దిగుబడి బాగున్నప్పటికీ అనుకున్న స్థాయిలో ధరలు లేకపోవడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు లబోదిబో మంటున్నారు. మండలంలోని కొట్టుగుమ్మడ, బూరుగ, నడుకూరు, సిఎస్ఆర్ పేట, ఎం.రాజపురం, వీరఘట్టం, చిదిమి తదితర గ్రామాల్లో సుమారు 150 మందికి పైబడి రైతులు సుమారు 250 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. పంట పుష్కలంగా దిగుబడి ఉన్నప్పటికీ బహిరంగ మార్కెట్లో ధర లేకపోవడంతో పండిన పంట ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు. ఎకరా విస్తీర్ణంలో టమోటా సాగు చేసేందుకు విత్తనాలు, ఎరువులు, కూలి తదితర మదుపులకు సుమారు రూ.60వేల వరకు మదుపులు అయ్యాయని రైతులు చెబుతున్నారు. తీరా పంట మంచిగా ఉన్నా ధర లేకపోవడంతో పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 25 కిలోల ట్రే టమోటా రూ.50కు విక్రయిస్తున్నామని, పండిన టామోటాలు ఏరేందుకు ఒక మనిషికి రూ.200 చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. పండిన పంట డబ్బులు కూలీలకే ఇస్తే ఇక తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చేతికి అంది వచ్చే కేబేజీ పంట కళ్లముందే నాశనం కావడంతో అప్పులు ఊబిలో కూరుకు పోయామని, తీరా టమోటా ద్వారానైనా అప్పులు తీరుతాయన్న ఆశ ఆవిరైపోయిందని రైతులు వాపోతున్నారు. భారీ వర్షాలకు పాడైపోయిన కేబేజీ పంటను అధికారులు వచ్చి చూసి వెళ్లారే తప్ప కనీసం నష్టపరిహారం కూడా అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటకు ధర వచ్చేంత వరకు పంటను నిల్వ చేసుకునేందుకు కనీస సౌకర్యం లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కిలో టమోటా రూ.10 ఉన్నప్పటికీ కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఎరుపుగా ఉన్న టమోటా మీద వర్షం పడితే తెల్లని మచ్చలు ఏర్పడతాయని రైతుల వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టమోటాకు మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## మాతాశిశు మరణాలు అరికట్టాలి



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో మాతాశిశు మరణాలను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మాతాశిశు ఆరోగ్య సంబంధ అంశాలపై వైద్యారోగ్యశాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో సఫలీకృతం కావాలని, వాటిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రధానంగా హైరిస్క్ గర్భిణులను ముందుగా గుర్తించి వారికి అవసరమైన సేవలు అందించాలన్నారు. మాతాశిశు మరణాల రేటును తగ్గించడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. బాల్య వివాహాలు, మధ్యలో చదువు మానేయడం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. హెల్త్ సబ్ సెంటర్ల భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, బర్త్ వెయిటింగ్ హాళ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పక్కాగా అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు సకాలంలో అవసరమైన వైద్య సేవలు అందించాలని, నెట్ వర్క్ ఆస్పత్రుల్లో వారికి నెలకు రెండు మార్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రుల్లో గర్భ నిర్ధారణ పరీక్షల నిర్వహణ, డేటా సేకరణలో డీఎంహెచ్‌వో తీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై గర్భ నిర్ధారణ అంశాల్లో పక్కాగా ఉండాలన్నారు. చట్ట రీత్యా నేరమైన లింగ నిర్ధారణ పరీక్షలను ఎవరు నిర్వహించినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఎక్కడా లింగ నిర్ధారణ పరీక్షలు జరగకూడదని, వైద్యారోగ్య శాఖాధికారులు, జిల్లా సలహా కమిటీ ప్రతినిధులు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ చేస్తే వారి స్కానింగ్ సెంటర్ లైసెన్సును రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ డి.కృష్ణమూర్తినాయక్, మెడికల్ కాలేజీ గైనికాలజి నిపుణుడు టి.నరసింగరావు, వైద్యులు శ్రీలత, ఎం.కిరణ్‌కుమార్, డిప్యూటీ డెమో సింహాచలం, అమెరికన్ ఫౌండేషన్ ప్రతినిధి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే విజయవాడ, అనంతపురంలో తలసేమియా సెంటర్లు

**కుప్పం, పతాకం న్యూస్:** కుప్పం నియోజకవర్గంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వయం ఉపాధికి చేయూత' కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30 మందికి తోపుడు బండ్లు, పలువురికి వినికిడి మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను భువనేశ్వరి వివరించారు. ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ పనిచేశారని భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 29 సంవత్సరాలు పూర్తయిందన్నారు. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల ట్రస్ట్ బాధ్యతలు తనకు అప్పగించారని అన్నారు. చంద్రబాబు అందించిన స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు తమ వంతు సాయం అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే విజయవాడ, అనంతపురంలో కూడా తలసేమియా సెంటర్లు ప్రారంభిస్తామని నారా భువనేశ్వరి ప్రకటించారు.

# పేదల ఆర్థిక ప్రగతికి బ్యాంకులు విరివిగా రుణాలివ్వాలి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** ప్రజల ఆర్థిక ప్రగతికి బ్యాంకులు విరివిగా రుణాలు అందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ కోరారు. ం కలెక్టరేట్‌లో 'డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ' (బ్యాంకర్ల) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలు, వాటి ఫలితాలను లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పేదల ఆర్థిక అభ్యున్నతికి కోసం ప్రభుత్వాలు వివిధ పథకాలకు ఎంపిక చేస్తున్న లబ్ధిదారులకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. ఇంకా ఎంఎస్ఎంఈలు, పీఎం సూర్యఘర్ లబ్ధిదారులకు, పిల్లల ఉన్నత చదువులకు, వ్యవసాయానికి విరివిగా రుణాలు అందించాలని సూచించారు. అదే విధంగా వివిధ సంక్షేమ కార్పొరేషన్లు ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఆయా యూనిట్ల ఏర్పాటు కోసం ఉదారంగా రుణాలు ఇవ్వాలని అన్నారు. ఆయా శాఖల అధికారులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి రుణాల మంజూరులో సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోం



**విజయనగరం, పతాకం న్యూస్:** పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని కమిషనర్ బాలస్వామి అన్నారు. నగరంలోని కెఎల్‌పురం, తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణపై స్థానికులను ఆరా తీశారు. వారి నుండి మిశ్రమ స్పందన రావడంతో సంబంధిత పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులను మందలించారు. నిర్లక్ష్యంగా ఉన్నట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శత శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం కాలువలలో పూడిక తీస్తున్నారా? లేదా అన్నది గమనించారు. అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. నీటి శుద్ధి ప్లాంటును పరిశీలించారు.భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి భవన నిర్మాణాలు, అదనపు కట్టడాలకు నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరని కమిషనర్ బాలస్వామి స్పష్టం చేశారు. పూల్‌బాగ్, తదితర ప్రాంతాల్లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనితతో కలిసి భవన నిర్మాణాలు, లేఅవుట్ క్రమబద్ధీకరణ అంశాలను గమనించారు. ప్లాన్ ప్రకారం మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని, డివియేషన్ గుర్తిస్తే కట్టడాలను తొలగిస్తామని కమిషనర్ చెప్పారు.

## ప్రజారోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు



**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రజారోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పొగిరి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. కలుషిత ఆహారం తిని, వాంతులు, విరేచనాలకు అయినట్లు వైద్యాధికారులు చేసిన పరీక్షలో తేలిందని, గ్రామంలో డయేరియా లక్షణాలు లేవని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే గ్రామంలో మంచినీటి నమూనాలను పరీక్షలకు పంపామని చెప్పారు. ఆ బోర్ నీరు తాగకుండా ప్రస్తుతానికి ఆపివేశామని తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూఛిచారు. ఈ సందర్భంగా అస్వస్థతకు గురైన వారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సుమల వెంకట మన్మథరావు, గురవాణ నారాయణ రావు, పిన్నింటి మోహనరావు, దుప్పలపూడి శ్రీను, వంగా వెంకటరావు, కోటగిరి నారాయణరావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, మాడుగుల జయరాం, వల్లూరి గణేష్, సమతం శ్రీను, మహేష్, జగన్మోహన్, బవిరి శ్రీనుబాబు, మురళీ, కెల్ల రమణ పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్‌పివి వ్యాక్సినేషన్



**మధురవాడ, పతాకం న్యూస్:** గర్భాశయ ముఖద్వార కేన్సర్ నివారణకు అర్హులైన బాలికలందరికీ హెచ్‌పివి వ్యాక్సినేషన్ చేయాలని తెలుగు యువత నాయకులు గంటా రవితేజ సూచించారు. స్థానిక పిహెచ్‌సిని సందర్శించి, హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు.వ్యాక్సిన్ నిల్వలు, పంపిణీ తీరుపై వైద్యాధికారి డాక్టర్ దీపికను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌పివి వ్యాక్సినేషన్‌పై ప్రజల్లో అపోహలను తొలగించి, వారిని చైతన్యవంతం చేయడం ద్వారా అర్హులందరికీ వేయాలని సూచించారు. ఆరోగ్యవంతమైన భీమిలిని తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. భీమునిపట్నం మండలం తాళ్లవలస పిహెచ్‌సిలో హెచ్‌పివి వ్యాక్సినేషన్‌ను గంటా రవితేజ పరిశీలించారు. టీకా వేయించుకున్న విద్యార్థులతో మాట్లాడి, ఎటువంటి భయపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్‌లో సర్వైకల్ కేన్సర్ రాకుండా వ్యాక్సిన్ రక్షణగా నిలుస్తుందని వివరించారు. కష్టబడి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డాక్టర్. శోభారాణి, డాక్టర్. సుబ్బరాజు, వైద్య సిబ్బంది జి.రాజ్‌కుమార్,సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్ స్టేషన్లు ఆహ్లాదకరంగా ఉండాలి: కలెక్టర్



**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలోని ఆర్‌టిసి బస్ స్టేషన్లు ప్రయాణీకులకు ఆహ్లాదాన్ని ఇచ్చేలా, అన్ని రకాల మౌలిక వసతులతో ఉండాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌టిసి బస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలు, తాగునీటి వసతి, విక్రయ దుకాణాలు, మరుగుదొడ్లు, పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ప్రయాణీకులతో మాట్లాడి ఆర్‌టిసి ద్వారా అందుతున్న సేవల పట్ల పూర్తిస్థాయిలో సంతృప్తిగా ఉన్నారా అని ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు శత శాతం సంతృప్తి చెందేలా సేవలు అందించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవి దృష్ట్యా ప్రయాణీకులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, మరుగుదొడ్ల నిర్వహణ నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. సిబ్బంది ప్రయాణీకుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బస్సుల రాకపోకల సమయాల గురించి కచ్చితమైన సమాచారం అందించాలని సూచించారు. కాలపరిమితి దాటిన తినుబండారాలు దుకాణాల్లో విక్రయంచకుండా చూడాలని, అలాగే అధిక ధరలకు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ తనిఖీలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎస్.లక్ష్మణరావు, ఇతర రెవెన్యూ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం



**రణస్థలం, పతాకం న్యూస్:** మధ్యాహ్నం భోజన పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన ఆహారం, రుచి కరమైన పదార్థాలను అందించే ఏర్పాట్లు చేయడంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబు నిబద్ధతకు నిదర్శమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. పాతర్లపల్లి హైస్కూల్‌లో డొక్క సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే మండలంలోని ఓ పరిశ్రమ సౌజన్యం తో పాతర్లపల్లిలో 60 లక్షలతో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని ప్రా రంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, బెండు మల్లేశ్వరరావు, రవి, గొర్లె సాయి, దుమ్ము అశోక్, వడ్డాది శ్రీను పాల్గొన్నారు.

## రాజ్ కేసిరెడ్డి ఆస్తుల జప్తుకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



**అమరావతి, పతాకం న్యూస్:** ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. మద్యం స్కామ్ ద్వారా వచ్చిన ముడుపులతో రాజ్ కేసిరెడ్డి తన తల్లిదండ్రుల పేరిట తెలంగాణలోని జనగామ, షాబాద్ ప్రాంతాల్లో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు సిట్ గుర్తించింది. ముఖ్యంగా షాబాద్‌లో తన తల్లి కేసిరెడ్డి సుభాషిణి పేరుతో కొన్న 17.60 ఎకరాల భూమి అసలు మార్కెట్ విలువ దాదాపు రూ. 70 కోట్లు కాగా, రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం రూ. 2.69 కోట్లుగా చూపించారు. అలాగే జనగామలో తండ్రి ఉపేంద్ర రెడ్డి పేరుతో లక్షల విలువైన ప్లాట్లు ఉన్నట్టు గుర్తించారు. ఈ బినామీ ఆస్తులన్నింటినీ జప్తు చేసేందుకు విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిట్ సిద్ధమైంది. ఇప్పటికే ఈ కేసులో రాజ్ కేసిరెడ్డికి సంబంధించి వందల కోట్ల విలువైన ఆస్తులను ఈడీ, సిట్ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కొత్తగా గుర్తించిన రూ. 70 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేయాలని సిట్ నిర్ణయించింది. దీనికోసం అనుమతిని కోరగా... ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# ఇరాన్ చమురు కొనుగోలు వార్తలపై క్లారిటీ ఇచ్చిన రిలయన్స్ ఇండస్ట్రీస్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోలు చేసినట్లు తమపై వస్తున్న వార్తలను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) తీవ్రంగా ఖండించింది. ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవి అని కొట్టిపారేసింది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది. సముద్ర మార్గంలో చిక్కుకుపోయిన ఇరాన్ ముడి చమురుపై అమెరికా ప్రభుత్వం తాత్కాలికంగా ఆంక్షలను సడలించడంతో, రిలయన్స్ ఈ అవకాశాన్ని వినియోగించుకుందని పలు మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ నుంచి రిలయన్స్ సుమారు 5 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసిందని ఈ కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే రిలయన్స్ స్పందించింది. "ఇరాన్‌కు చెందిన ముడి చమురును కంపెనీ కొనుగోలు చేసిందంటూ ఇటీవలి మీడియా నివేదికలను రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తోంది. ఈ నివేదికలు నిరాధారమైనవి. ప్రజలను తప్పుదారి పట్టించేలా, తప్పుడు వాదనలకు దారితీసేలా ఉన్నాయి" అని కంపెనీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. వార్తలను ప్రచురించే ముందు సంబంధిత మీడియా సంస్థలు వాస్తవాలను ధృవీకరించుకోవాలని హితవు పలికింది. గత వారం, అమెరికా ఆర్థిక శాఖ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నౌకల్లో నింపి, సముద్రంలో చిక్కుకుపోయిన ఇరాన్ చమురు అమ్మకానికి స్వల్పకాలిక అధికారాన్ని మంజూరు చేసింది. ఈ చర్య ద్వారా ప్రపంచ సరఫరాను వేగంగా పెంచవచ్చని, అదే సమయంలో టెహ్రాన్‌పై ఒత్తిడిని కొనసాగించవచ్చని డొనాల్డ్ ట్రంప్ పరిపాలన యంత్రాంగం భావిస్తున్నట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, "ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి ఈ చర్య తీసుకున్నాం. మార్చి 20 నాటికి ఇప్పటికే నౌకల్లో లోడ్ చేసిన చమురుకు మాత్రమే ఈ అధికారం వర్తిస్తుంది" అని తెలిపారు. ఏప్రిల్ 19 వరకు ఈ వెసులుబాటు అమల్లో ఉంటుందని ట్రెజరీ జనరల్ లైసెన్స్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో సుమారు 140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి అందుబాటులోకి వస్తుందని, సరఫరాపై ఒత్తిడి తగ్గుతుందని బెస్సెంట్ వివరించారు. ఆంక్షలు విధించిన ఇరాన్ చమురులో ఎక్కువ భాగం చైనా వంటి దేశాలు చౌకగా నిల్వ చేసుకుంటున్నాయని, ఈ తాజా నిర్ణయంతో టెహ్రాన్ ప్రాబల్యాన్ని తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాల మధ్య తమపై వచ్చిన ఆరోపణలను రిలయన్స్ ఖండించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువు నిల్వలున్నాయి : జెపి నడ్డా



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లుపై శుక్రవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన శక్తిసింగ్ గోయల్.. దేశంలో ఉన్న ఇంధన సంక్షోభాన్ని ఆయన ఎత్తిచూపారు. ప్రభుత్వం చాలా వరకు దిగుమతులపై ఆధారపడుతోంది. అందుకే దేశం ఇప్పుడు ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది అని ఆయన ఆరోపించారు. గుజరాత్ చమురు బావుల నుండి ఎలాంటి చమురు ఉత్పత్తి కావడం లేదని ఆయన ఎత్తిచూపారు. ఇక ఆర్‌జెడి ఎంపి సంజరు యాదవ్ విమానయాన సంస్థలు ప్రైవేటు సంస్థలపై విమర్శలు చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి వంటి సంక్షోభ సమయాలను ఆసరాగా చేసుకుని.. విమానయాన సంస్థలు, ప్రైవేటు సంస్థలు సర్జ్ ప్రైసింగ్‌ను పెంచుతున్నాయని విమర్శించారు. కాగా, లోక్‌సభలో ఎరువుల దిగుమతుల కోసం ప్రభుత్వం కొత్త మార్కెట్లను అన్వేషిస్తుందా అని కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ అడిగిన ప్రశ్నకు.. 'ఖరీఫ్ సీజన్‌కు సరిపడా నిల్వలు ఉన్నాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని' ఎరువుల శాఖా మంత్రి జె.పి నడ్డా సమాధానమిచ్చారు.

# ఏప్రిల్ 25న కొత్త పార్టీ పేరును ప్రకటిస్తా : కవిత



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తాను ఏర్పాటు చేయబోయే కొత్త పార్టీతో రాష్ట్ర రాజకీయాలు మారుస్తానని జాగఅతి చీఫ్ కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీ రామ నవమి సందర్భంగా .... శుక్రవారం కవిత నిజామాబాద్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తి రావాలని.. సర్వోదయ తెలంగాణ సాధన కోసమే కొత్త పార్టీ పెడుతున్నట్లు తెలిపారు. మార్పు కోరుకునే అభ్యుదయ వాదులంతా తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సాధించి పన్నెండేళు దాటింది... కానీ నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించుకోలేకపోయామన్నారు. ఎలాంటి పరిపాలనలో ఉన్నామో ప్రజలు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ పార్టీ రావాలని బలంగా కోరుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగానే 2026, ఏప్రిల్ 25 న తన కొత్త పార్టీ పేరు ప్రకటిస్తానని తెలిపారు. ఆ రోజు బలమైన ముహూర్తం ఉందన్నారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లోని ఓ ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు పార్టీ ప్రకటన ఉంటుందని తెలిపారు. శ్రీ రామ చంద్రుడి దయతోనే అందరి జీవితంలో కొత్త పార్టీ వెలుగులు నింపుతుందని అన్నారు. పార్టీ ప్రకటన ముందు వారణాసి వెళ్లి గంగ స్నానం, శివుడికి అభిషేకం చేస్తామని తెలిపారు. యువతకు తమ పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని, ముఖ్యంగా ఆడ బిడ్డలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఏప్రియల్ 25 న కొత్త పార్టీ ప్రకటన రోజు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు.

# ప్రయాణికుల ప్రయాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు?



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. గతేడాది అక్టోబర్ 24న కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధమై 20 మంది మరణించిన ఘటన మరువక ముందే రాష్ట్రంలో అలాంటి ఘటనలు పునరావృత మవుతున్నాయి. తాజాగా ప్రకాశం జిల్లా మార్కాపురం వద్ద టిప్పరు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢకొని మంటలు చెలరేగడంతో బస్సు దగ్ధమై 13 మంది సజీవదహనమయ్యారు.

ప్రయివేట్ బస్సుల్లో నిర్వహణలో లాభాలే ప్రమాణంగా ఉండడంతో నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయన్న విమర్శలు భారీ ఎత్తున వినిపిస్తోంది. ముఖ్యంగా సుదూర ప్రయాణం చేసే బస్సులలో డ్రైవర్లకు తగినంత విశ్రాంతి లేకపోవడంతో పాటు అనుకున్న సమయానికి ప్రయాణికులను లక్ష్యానికి చేర్చాలన్న టార్గెట్ కూడా వారిపై ఒత్తిడిని పెంచుతోంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల బాడీ బిల్డింగ్‌లోనే నిర్మాణంలో నిబంధనలను పట్టించుకోకుండా మార్పులు చేపడుతున్నారు. ప్రయాణికుల భద్రతను పక్కనపెట్టి బస్సులను లగ్జరీగా మార్చే పేరుతో అనధికారిక మార్పులు చేసేస్తున్నారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం బస్సుల నిర్మాణం, సీట్ల అమరిక, అత్యవసర ద్వారాలు, అగ్నిమాపక పరికరాలు వంటి అంశాల్లో కచ్చితమైన ప్రమాణాలు పాటించాలి. కొంతమంది ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ బస్సులలో అదనపు బెర్తులు, సీట్లను అమర్చి సామర్థ్యాన్ని పెంచుతున్నారు. దీని వల్ల ప్రమాదాల సమయంలో ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. ముఖ్యంగా స్లీపర్ కోచ్ బస్సుల్లో మార్పులు అధికంగా జరుగుతున్నాయి. అనుమతి లేకుండా వాహనాల ఎత్తు, వెడల్పు మార్పులు చేయడం, అత్యవసర నిష్క్రమణ మార్గాలను సరిగా ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలు బయటపడుతున్నాయి. కొన్ని బస్సుల్లో అగ్నిమాపక పరికరాలు కూడా లేకపోవడం గమనార్హం.

గతేడాది జనవరి 18న ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్తున్న ప్రయివేటు బస్సు విజయనగరం జిల్లా మధుపాడ సమీపంలో ట్రక్కును ఢీ కొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. 15 మంది గాయపడ్డారు.

గతేడాది మార్చి 6న హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న రమణ ట్రావెల్స్ బస్సు ఏలూరు జిల్లా చోడిమెల్ల సమీపంలో ట్రక్‌ను డీకొనడంతో ముగ్గురు మృతి చెందారు. 20 మందికి పైగా గాయపడ్డారు. బస్సు అధిక వేగమే ఈ ప్రమాదానికి కారణమని తేలింది.

గతేడాది అక్టోబర్ 24న కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద కావేరి బస్సు దగ్ధమై 20 మంది సజీవదహనమయ్యారు.

గతేడాది నవంబర్‌లో ఏలూరు జిల్లా లింగాయపాలెం వద్ద ఓ ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందారు.

గతేడాది డిసెంబర్ 12న ప్రస్తుత పోలవరం జిల్లా మారేడుమిల్లి -చింతూరు ఘాట్‌లో శ్రీ విఘ్నేశ్వర ట్రావెల్ బస్సు లోయలో పడి తొమ్మిది మంది మరణించారు. మృతుల్లో చిత్తూరు జిల్లాకు చెందిన వారు ఉన్నారు.

ఈ 2026 జనవరి 22న నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలంలో ప్రయివేట్ బస్సు దగ్ధం కావడంతో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు.

2009 జులై 12న శివసాయి ట్రావెల్స్‌కు చెందిన ఓ ప్రయివేటు బస్సు ఆళగడ్డ సమీపంలో నిలిచి ఉన్న ఐరన్ ఓర్ లారీ పక్క నుంచి పోవడంతో 11 మంది మృతి చెందారు.

2013 అక్టోబర్ 30న బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్ బస్సు మహబూబ్‌నగర్ జిలా పాలెం వద్ద దగ్ధం కావడంతో 45 మంది సజీవ దహనమయ్యారు.

# పీఎన్జీ అందుబాటులో ఉన్నవారికి ఎల్పీజీ నిలిపివేత



**కడప, పతాకం న్యూస్:** పిఎన్‌జి (పైప్డ్ నేచురల్ గ్యాస్) అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఉన్న వారు కచ్చితంగా ఎల్‌పిజికి బదులుగా పిఎన్‌జి వినియోగానికి బదిలీ కావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వినియోగదారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సివిల్ సప్లరు శాఖ ఆధ్వర్యంలో పిఎన్‌జి వినియోగంపై అవగాహన పెంచేందుకు కో -- ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్‌తోపాటు జెసి డాక్టర్ నిధీమీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో వంట గ్యాస్ కొరత కొనసాగుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుందన్నారు. ఆ మేరకు పిఎన్‌జి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఉన్న వారు కచ్చితంగా మారిపోవాల్సి ఉంటుందని, వారందరికీ త్వరలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరా ఆగిపోనుందనే విషయాన్ని కూడా తెలియజేసారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్‌లో ఎల్‌పిజి గ్యాస్ కొరత ఏర్పడిన సంగతి తెలిసిందేనని, ప్రస్తుతం పరిస్థితులు అదుపులోనే ఉన్నా ఈ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఇకపై పైప్డ్ నేచురల్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని కుటుంబాలకు ఎల్‌పిజి గ్యాస్ డెలివరీని నిలిపివేయనున్నట్లు తెలిపిందన్నారు. పిఎన్‌జి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఆ కనెక్షన్‌కు మారాలని స్పష్టం చేసిం దన్నారు. అందుకు కొంత సమయం కూడా గడువు ఇస్తున్నట్లు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. పిఎన్‌జికి మారడం ద్వారా గ్యాస్ సిలిండర్ల రీఫిల్స్ బుకింగ్ చేసే అవసరం తొలగిపోతుందని చెప్పారు. ఏదైనా టెక్నికల్ ఇష్యూ వల్ల ఇంటికి పైపు లైన్ కనెక్షన్ ఇవ్వడం సాధ్యం కాని సందర్భంలో మాత్రమే ఎల్‌పిజి సరఫరా కొనసాగుతుందని వెల్లడించారు. జెసి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పారిశ్రామిక యూనిట్లలో ఆరెంజ్ రెడ్ జోన్లలో ఉన్న యూనిట్లు తప్పనిసరిగా పిఎన్‌జి వాడకాన్ని అమలు చేయాలని సూచించారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక జీవోను కూడా విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో కెఎంసి కమోషనర్ రాకేష్ చంద్రం, డిఎస్ఒ రఘురాం, పరిశ్రమల శాఖ, పొల్యూ అండ్ కంట్రోల్ బోర్డు, సివిల్ సప్లయి సంబంధిత శాఖల అధికారులు, హోటల్స్, పరిశ్రమలు, కమర్షియల్ సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

# వాణిజ్య గ్యాస్‌కు తీవ్ర కొరత.. హోటళ్లపై తీవ్ర ప్రభావం



**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో వాణిజ్య అవసరాల గ్యాస్ సిలిండర్ల సరఫరా బాగా తగ్గిపోయింది. రోజులో సిలిండర్ అవసరమైన కొన్ని రెస్టారెంట్లకు.. బుక్ చేసిన వారం రోజుల తరువాతే సిలిండర్ డిలివరీ అవుతున్నది. దీంతో పలు హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కట్టెల పొయ్యిలను ఏర్పాటు చేసుకుంటున్నారు. మరోవైపు తయారు చేసే ఆహార పదార్థాల్లో కొన్నింటిని నిలుపుదల చేశారు. గ్యాస్‌తో అయితే ఐదు నిమిషాల్లో వండగలిగే ఆహార పదార్థాలను కట్టెల పొయ్యిపై వండడానికి 20 నిమిషాలు పడుతున్నదని, దీంతో కస్టమర్లు ఎక్కువసేపు వేచివుండలేక వెళ్లిపోతున్నారని పలు హోటళ్ల నిర్వాహకులు వాపోతున్నారు. కట్టెల పొయ్యిలు సైతం ఏర్పాటు చేసుకునే వెసులుబాటులేని వారు తాత్కాలికంగా తమ వ్యాపారాలను మూసివేస్తున్నారు.కాగా గృహ వినియోగదారులకు సైతం గతంలో మాదిరిగా సత్వరమే సిలిండర్ డెలివరీ జరగడంలేదు. బుక్ చేసిన పది రోజుల తరువాత ఇస్తున్నారని చెబుతున్నారు. కానీ అధికారులు మాత్రం జిల్లాలో ఎక్కడా వంట గ్యాస్ కొరత లేదని అంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరో విధంగా వున్నాయి. నిబంధనల ప్రకారం వంట గ్యాస్ బుకింగ్‌కు పట్టణాల్లో అయితే 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 45 రోజులు గడువు ఉంటుందని, ఈలోగా రీఫిల్ కోసం బుక్ చేసుకున్నా, గడువు దాటిన తరువాతే సిలిండరు డెలివరీ అవుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే అధికారులు చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రకటనలు వాస్తవం కాదని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. 45 రోజులు దాటిన తరువాతే రీఫిల్ బుక్ చేస్తున్నామని, అయినాసరే పది రోజుల తరువాత సిలిండర్ డెలివరీ అవుతున్నదని అంటున్నారు. గ్యాస్ ఏజెన్సీలకు దూరంగా వున్న గ్రామాల గ్యాస్ వినియోగదారుల ఇక్కట్లు వర్ణనాతీతం. గతంలో వారానికి ఒక రోజు గ్రామాలకు వ్యాన్‌లో సిలిండర్లు తీసుకువచ్చి డెలివరీ చేసేవారని, పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన తరువాత గ్రామాలకు సిలిండర్ల వ్యాన్ రావడం లేదని, దీంతో ఖాళీ సిలిండర్ తీసుకొని గ్యాస్ ఏజెన్సీ వద్దకు తామే వెళ్లాల్సి వస్తున్నదని, అయినాసరే అప్పటికప్పుడు సిలిండర్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గ్యాస్ కోసం పడిగాపులు



**బలిజపేట, పతాకం న్యూస్:** బలిజిపేట మండలంలో సామాన్య ప్రజల గుండెల్లో గ్యాస్ గుబులు పట్టుకుంది. అమెరికా ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు కారణంగా గ్యాస్ రేట్లు పెరుగుదలతోపాటు గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో మండల ప్రజలు గ్యాస్ కోసం అల్లాడుపోయే పరిస్థితి ఏర్పడుతుంది. యుద్ధం కారణంగా గ్యాస్ నిల్వలు తగ్గిపోయాయన్న ఊహాగానాలు ఒకవైపు ఉంటే గ్యాస్ అందించవలసిన ఏజెన్సీలు మండలములోని ప్రతి గ్రామానికి వెళ్లి వినియోగదారులకు అందించవలసిన బాధ్యత ఉన్నప్పటికీ ఏజెన్సీలు పూర్తిగా చేతులు ఎత్తివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బలిజిపేట మండలంలో హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం గత నెల రోజుల నుండి వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు అందించడంలో విఫలమైనట్లు వినియోగదారులు చెబుతున్నారు. దీంతో గ్యాస్ వినియోగదారుల ఇంటిలో గ్యాస్ నిల్వలు లేకపోవడంతో వంట చేసుకుని తినేందుకు కూడా ఇబ్బందులు పడుతూ, హోటల్లో కూడా పాత పద్ధతి పై కట్టెలతో వండుకునే పరిస్థితి ఏర్పడుతుంది. హెచ్.పీ గ్యాస్ గోదాముల్లో నిల్వలు లేకపోవడంతో వినియోగదారులకు అందడం లేదు. గ్యాస్ యాజమాన్యము ఎప్పుడు సిలిండర్లు అందజేస్తున్నారని మహిళలు ఏజెన్సీ కేంద్రముల వద్ద రోడ్ల పైన తమ ఖాళీ గ్యాస్ సిలిండర్లు పెట్టుకుని ఎదురు చూడవలసిన పరిస్థితి ఏర్పడింది. కమర్షియల్ దుకాణములలో ఇంటికి వాడే గ్యాస్ సిలిండర్లు అత్యధికముగా వాడకముతో సామాన్య ప్రజలకు గ్యాస్ అందడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్యాస్ సమస్యలపై స్పందించి సకాలంలో గ్యాస్ అందచేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## శ్రీరామనవమి సందర్భంగా 1300 మందికి అన్నదానం

**బాపట్ల, పతాకం న్యూస్:** యద్దనపూడి మండలంలోని అన్ని గ్రామాలలోని సీతారామస్వామి, ఆంజనేయస్వాముల దేవాలయాలలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాములకు కళ్యాణం చేసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని యనమదల గ్రామములోని సీతారామస్వామి ఆంజనేయస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మ కర్త నిమ్మరాజు శేషు కుమార్ ఆధ్వర్యంలో సీతరాములకు కళ్యాణం నిర్వహించి భక్తులకు వడపప్పు, పానకం పంచి పెట్టారు. అనంతరం సుమారు 1300 మందికి అన్నదానం చేశారు. దేవాలయాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డుల ఆందోళన



**కాకినాడ, పతాకం న్యూస్:** తమ సమస్యలను పరిష్కరించాలని రిలే నిరహారదీక్షలకు దిగిన కాకినాడ జిజిహెచ్, రంగరాయ వైద్య కళాశాల సెక్యూరిటీ గార్డుల ఆందోళన రెండో రోజైన కొనసాగాయి. జిజిహెచ్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద జరిగిన రిలే దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిజిహెచ్‌లో సెక్యూరిటీ గార్డ్సుకి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు చెల్లించడం లేదన్నారు. ఫిబ్రవరి నెల జీతం నేటికీ సెక్యూరిటీ గార్డ్సుకి గాని, శానిటేషన్ వర్కర్సుకి గాని అందలేదన్నారు. సెక్యూరిటీ సంస్థ యాజమాన్యాన్ని పిలిపించి కార్మికులతో చర్చలు జరిపించి పరిష్కారం చేయాల్సిన బాధ్యత జిజిహెచ్ సూపరింటెండెంట్ పైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజరుకుమార్, సెక్యూరిటీ గార్డ్స్, సిఐటియు నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, పలివెల వీరబాబు, దుంపల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ళ పద్మ సంఘీభావం తెలిపారు.

## తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలి

**రాజోలు, పతాకం న్యూస్:** గ్రామాల్లో తాగునీరు కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాపై రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో రాజోలు, మామిడికుదురు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మండల పరిషత్, పంచాయతీరాజ్, వాటర్‌గిడ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్ఎ దేవవరప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామాల పరిపాలనలో పంచాయతీ కార్యదర్శులు మరింత బాధ్యతతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు ఎంపిపి కడలి శ్రీదుర్గ, వైస్ ఎంపిపి పొలమూరి శ్యాంబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



**కాకినాడ, పతాకం న్యూస్:** తలుపులమ్మ దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. తలుపులమ్మ దేవస్థానంలో జరుగుతున్న రోడ్లు, విశ్రాంతి గదులు, క్యూ లైన్లు, దర్శన మార్గం తదితర పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.1.6 కోట్లతో చేపట్టిన రెండవ ఘాట్ రోడ్డు, దేవస్థానం నిధులు రూ.4.5 కోట్లతో ఎస్కలేటర్ వంటి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆ పనులన్నీ వివిధ దశలో ఉన్నాయని, ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాత్రికులకు ప్లాస్టిక్ వాడకం తగ్గించి, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆలయంలో కరూర్ వైశ్య బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన కియోస్కోను ఆయన ప్రారంభించారు. ఈ పరిశీలనలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారి పి.విశ్వనాథరాజు, తుని తహశీల్దార్ జివిఎస్.ప్రసాద్, ఎంపిడిఓ జి.మరిడయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆయన అల్లిపూడి సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, భీమవరపుకోట గ్రామంలో బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. జిల్లాలో వసతి గృహాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

## లోన్‌యాప్‌లో అప్పు తీసుకొని చెల్లించలేక యువకుడు ఆత్మహత్య

**కాకినాడ, పతాకం న్యూస్:** లోన్ యాప్‌లో అప్పు తీసుకొని తిరిగి చెల్లించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం గండేపల్లి మండలంలోని సూరంపాలెం యూనివర్సిటీలో జరిగింది. స్థానిక వివరాల మేరకు ... అనకాపల్లి జిల్లా వడ్డాది మాడుగుల గ్రామం, మండలానికి చెందిన మహమ్మద్ బషీర్ (22) సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఎంబిఎ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. అతను లోన్ యాప్ ద్వారా డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించలేక, తల్లిదండ్రులకు చెప్పుకోలేక మనస్థాపం చెంది తాను ఉంటున్న రూమ్ లోనే సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని చనిపోయాడు. ఘటనపై యువకుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శివ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సంతాన లేమికి కారణాలు ఏమిటి?

ప్రస్తుతం చాలా మంది ఉన్నత చదువులు చదువుతున్నారు. ఉద్యోగాలు చేస్తూ, ఉన్నత పదవులు అందుకుంటున్నారు. ఇలా చదువులు, కెరీర్ ధ్యాసలో పడటం వల్ల పెళ్లి ఆలస్యంగా చేసుకుంటున్నారు. ఒకవేళ చేసుకున్న తర్వాత సంతానం కనటాన్ని వాయిదా వేసుకుంటున్నారు. జీవితంలో స్థిరపడ్డ తర్వాతే పిల్లలను కనాలని భావిస్తున్నారు. తర్వాత సంతానం కలగక డాక్టర్లు, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మరి, ఈ పరిస్థితికి కారణలేంటో ఇప్పుడు తెలుసుకుందాం! ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు కనుమరుగు కావటం, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తుండటం, పిల్లలను కన్న తర్వాత వారి ఆలనా పాలనా చూసుకునేవారు ఇంట్లో లేకపోవటం వంటివీ ఇలాంటి నిర్ణయం తీసుకోవటానికి పురికొల్పుతున్నాయంటున్నారు నిపుణులు. కెరీర్ పరంగా ఇది మంచిదే కావొచ్చు కానీ, ఆలస్యమవుతున్నకొద్దీ గర్భం ధరించటం కష్టమవుతుందని వివరిస్తున్నారు. రెండు మూడేళ్లు ప్రయత్నిస్తున్నా గర్భం ధరించకపోతే దంపతులు కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడినీ ఎదుర్కోవాల్సి వస్తుంటుందని హెచ్చరిస్తున్నారు. ఇది ఆందోళనకు దారితీయటమే కాదు, సంతానం కలగటం లోనూ ఇబ్బందులకు దారితీస్తుందని పేర్కొంటున్నారు.

మహిళల్లో సంతానం కలిగే దశ పరిమితం అని అంటున్నారు నిపుణులు. రజస్వల నుంచే ఇది మొదలైనప్పటికీ తొలినాళ్లలో అండం సరిగా విడుదల కాదని, నెలసరీ సక్రమంగా అవదని చెబుతున్నారు. అంటే, రెండు మూడేళ్ల తర్వాతే సంతానం కలిగే అవకాశముంటుందని వివరిస్తున్నారు. అంతేకాకుండా, మహిళల్లో సంతానం కలిగే అవకాశం 32 ఏళ్ల నుంచీ తగ్గుతూ వస్తుంటుందని, ఇది 37 ఏళ్లు తర్వాత గణనీయంగా పడిపోతుందని పేర్కొంటున్నారు. 40 ఏళ్ల వయసులోపు అండాశయాలు పనిచేయడం మానేస్తాయని అధ్యయనం



పేర్కొంది.అదే, మగవారికి ఏ వయసులోనైనా సంతానాన్ని కనే సామర్థ్యముంటుందని భావిస్తుంటారని, ఇది నిజం కాదని అంటున్నారు. మగవారికీ వయసు మీద పడుతున్న కొద్దీ సంతానం కలిగే సామర్థ్యం తగ్గుతూ వస్తుందని, వీర్యం నాణ్యత, శుక్రకణాల సంఖ్య 35 ఏళ్ల తర్వాత తగ్గుముఖం పడుతుందని తెలియజేస్తున్నారు. సంతానలేమితో బాధపడే మహిళల్లో రజస్వల నాటి నుంచే కొన్ని హెచ్చరిక సంకేతాలు కనిపిస్తాయంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో నెలసరి సక్రమంగా రాకపోవచ్చని, చాలా త్వరగా కానీ, మరీ ఆలస్యంగా కానీ అవచ్చని చెబుతున్నారు. కొంత మందికి నెల కన్నా ఎక్కువ సమయం పట్టొచ్చని, మరికొందరికి కొన్ని నెలల తర్వాతా నెలసరి రావొచ్చని పేర్కొంటున్నారు. ఒకసారి రుతుక్రమం మొదలైతే ఎక్కువ కాలం కొనసాగొచ్చని తెలియజేస్తున్నారు. ఇన్సులిన్ నిరోధకత, ఊబకాయం, ముఖం లేదా శరీరంపై అసాధారణ జుట్టు పెరుగుదల, మొటిమలతో సంబంధం కలిగి ఉంటుందని అధ్యయనం పేర్కొంది. ఇలాంటి సమస్యలకు ప్రధానంగా హార్మోన్ల సమతుల్యత లోపించటం దోహదం చేస్తుందంటున్నారు. అండాశయాల్లో నీటితిత్తులు అండం సరిగా విడుదల కాక పోవటం, చిన్నవయసులోనే అండాశయాలు పనిచేయటం మానెయ్యొచ్చని తెలియజేస్తున్నారు. ఇలాంటి సమస్యలకు చాలావరకూ రక్త పరీక్షలు, స్కానింగ్?తో గుర్తించవచ్చని సూచిస్తున్నారు. హార్మోన్ల మోతాదులు మామూలుగా ఉన్నా కూడా కొన్ని అవయవ సమస్యలూ సంతానం కలగటంలో ఇబ్బందులు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇందులో గర్భాశయం లోపలి పొరలు అయినా ఎండోమెట్రియం గర్భసంచి వెలుపలా పెరుగుతుందని, ఇది అండాశయాలను దెబ్బతీయొచ్చు, ఫెలోపియన్ గొట్టాలు మూసుకునేలా చేయొచ్చని వివరిస్తున్నారు. కొందరిలో కడుపులో వచ్చే క్షయ, కటిభాగంలో వచ్చే ఇతరత్రా సమస్యలూ గర్భధారణకు ఇబ్బంది కలిగించొచ్చని, మరికొందరిలో పుట్టుకతోనే గర్భాశయంలో లోపాలు ఉండొచ్చని పేర్కొంటున్నారు. స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థలో అండాశయాలు, గర్భాశయం, ఫెలోపియన్ నాళాలు, ఎండోక్రైన్ వ్యవస్థ వంటి అనేక రకాల అసాధారణతల వల్ల వంధ్యత్వం సంభవించవచ్చని అధ్యయనం పేర్కొంది. మగవారిలో క్రోమోజోమ్‌ల లోపాలు, వృషణాలు కిందికి దిగకపోవటం, వృషణాల ఇన్‌ఫెక్షన్ వంటి సమస్యలు సంతానం కలగక పోవటానికి దారితీయొచ్చని నిపుణులు చెబుతున్నారు. వరిబీజం కూడా ఒక కారణం అంటున్నారు. అంతేకాకుండా, మద్యం తాగటం, సిగరెట్లు కాల్చటం, మాదక ద్రవ్యాల వ్యసనం వంటివీ వీర్యం నాణ్యత, పనితీరును దెబ్బతీయొచ్చని హెచ్చరిస్తున్నారు. మహిళలు, పురుషులోనూ డయాబెటిస్, ఇతర దీర్ఘకాల సమస్యలూ సంతానలేమికి కారణమవుతుంటాయని నిపుణులు అంటున్నారు. అలాగే, ఒబెసిటీ కూడా పెద్ద ముప్పు కారకంగా చెబుతున్నారు. పురుగుమందులు, ప్లాస్టిక్స్? వాహనాల నుంచి వెలువడే పొగ వంటి పర్యావరణ అంశాలూ సంతానం కలగకపోవటానికి దారితీస్తుంటాయని వివరిస్తున్నారు. గర్భధారణకు ప్రయత్నిస్తున్నా సంతానం కలగకపోవటం మనసును కలచివేస్తుందని, కుంగుబాటుకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల శాస్త్రీయ పద్ధతిలో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. ఐవీఎఫ్ వంటి పద్ధతులు ఎంతో మేలు చేస్తాయని, ఆయా వ్యక్తులకు అనుగుణంగా చికిత్స చేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. భార్యాభర్తలు ఒకరినొకరు నిందించుకోకుండా కలిసికట్టుగా ప్రయత్నిస్తే సంతానభాగ్యాన్ని పొందటం పెద్ద కష్టమేమీ కాదంటున్నారు.సంతానం కోసం నిజంగా, తరచూ ప్రయత్నిస్తున్నప్పటికీ ఏడాది దాటినా గర్భం ధరించకపోతే సంతానలేమి సమస్యగా పరిగణిస్తారని అంటున్నారు.

# ఇరాన్ నుంచి మాకు గిఫ్ట్ వచ్చింది... 10 చమురు ట్యాంకర్లను పంపించింది: ట్రంప్




**న్యూయార్క్:** ఇరాన్ నుంచి తమకు పెద్ద గిఫ్ట్ వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ 10 చమురు ట్యాంకర్లను పంపించిందని ఆయన తెలిపారు. హర్మూజ్ జలసంధి గుండా వీటిని పంపించిందని ఆయన పేర్కొన్నారు. ఈ జలసంధి వద్ద ఇరాన్ ఎలాంటి టోల్ ఛార్జీని వసూలు చేయలేదని అన్నారు. ఇరాన్‌తో చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. హర్మూజ్ మీదుగా వస్తున్న ఆయా ట్యాంకర్లపై పాకిస్థాన్ జెండాలు ఉన్నట్లు వెల్లడించారు. పశ్చిమాసియాను స్వాధీనం చేసుకోవాలని ఇరాన్ భావించిందని, కానీ తాము అడుగుపెట్టేసరికి వారికి కష్టంగా మారిందని ట్రంప్ అన్నారు. ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఒమన్ దేశాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుందని ఆరోపించారు. పశ్చిమాసియాను స్వాధీనం చేసుకోవడానికి ఇరాన్ వద్ద పక్కా ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. అందుకే ఆ దేశాల పైకి క్షిపణులను ప్రయోగించిందని అభిప్రాయపడ్డారు. గల్ఫ్ దేశాల పైకి ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో కొన్ని యుద్ధం ప్రారంభానికి చాలాకాలం ముందే గురిపెట్టి ఉన్నాయని ట్రంప్ అన్నారు. ఆయుధాలను లోడ్ చేసి దాడులకు సిద్ధంగా ఉంచిందని ఆరోపించారు. అయితే అమెరికా దాడి నేపథ్యంలో అంతా నిర్వీర్యమైందని అన్నారు. ఇరాన్, అమెరికా మధ్య ఒప్పందం కుదిరే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని ట్రంప్ ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ అన్నారు. యుద్ధాన్ని నిలిపివేసేందుకు రూపొందించిన పదిహేను పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ముందు ఉంచినట్లు అమెరికా వెల్లడించింది. ఒప్పందం కుదురుతుందని, ఉద్రిక్తతలు తగ్గుతాయని స్టీవ్ విట్కాఫ్ అభిప్రాయపడ్డారు.

అమెరికాపై రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నార్డ్‌స్ట్రీమ్ పైప్‌లైన్‌ను అమెరికా స్వాధీనం చేసుకోవాలని భావిస్తోందని ఆరోపించారు. ఫ్రాన్స్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఇంధన మార్కెట్‌పై ఆధిపత్యం కోసం అమెరికా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇందులో భాగంగా యూరప్ కు సరఫరా చేసే గ్యాస్ పైప్‌లైన్‌లను తమ చేతుల్లోకి తీసుకోవాలని చూస్తోందని అన్నారు. శీతాకాలంలో యూరప్ ఖండానికి రష్యా నుంచి గ్యాస్ సరఫరాలో నార్డ్ స్ట్రీమ్‌ది కీలకపాత్ర. జర్మనీకి సహజ వాయువును తీసుకువచ్చేందుకు బాల్టిక్ సముద్రంలో నార్డ్ స్ట్రీమ్ గొట్టపు మార్గాలను నిర్మించింది. 2022లో ఈ పైప్‌లైన్‌లలో లీకేజీలు కనిపించాయన్నారు.

# తీవ్రమవుతున్న పెట్రోల్, డీజిల్ కొరత?

## పాడేరులో రెండు బంకుల్లోనే నిల్వలు.. ఐదు బంకుల్లో అంతంతమాత్రమే..




**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** పశ్చిమాసియా దేశాల యుద్ధం ప్రభావం జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దీంతో బంకుల్లో ఎప్పుడు చమురు ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. జిల్లా కేంద్రం పాడేరులో ఏడు బంకులుండగా, రెండు బంకుల్లో మాత్రమే డీజిల్, పెట్రోల్ నిల్వలున్నాయి. మిగిలిన బంకుల్లో ఎప్పుడు ఏం ఉంటుందో తెలియని దుస్థితి కొనసాగుతున్నది. పాడేరులో గురువారం పాత బంకులో పెట్రోల్, డీజిల్ లేకపోగా తలారిసింగిలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ బంకులోనూ అదే పరిస్థితి నెలకొంది. అలాగే చింతలవీధిలో ఐటీడీఏ నిర్వహణలో ఉన్న హెచ్‌పీ బంకులో పెట్రోల్ లేదు. జి.మాడుగుల మార్గంలో ఉన్న భారత్ పెట్రోలియం బంకులో డీజిల్ లేదు. ఇక విశాఖపట్నం వెళ్లే మెయిన్ రోడ్డులో ఉన్న టి.చిట్టినాయుడు, బొర్రా విజయరాణి ఫిల్లింగ్ స్టేషన్లలో మాత్రమే డీజిల్, పెట్రోల్ ఉంది. అయితే విశాఖపట్నంలోని ఆయా ఆయిల్ కంపెనీలకు వచ్చే నిల్వల ఆధారంగా మాత్రమే తమకు సరఫరా జరుగుతున్నదని, ఈ క్రమంలో డీజిల్, పెట్రోల్ అందుబాటులో ఉంటాయన్నారు. విదేశాల నుంచి వచ్చే నిల్వల ఆధారంగా మాత్రమే పరిస్థితులు ఆధారపడ్డాయని, ఈ నేపథ్యంలో బంకుల్లో చమురు నిల్వలపై కచ్చితంగా ఏమీ చెప్పలేమని యజమానులు అంటున్నారు. అయితే తాజా పరిణామాలతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

జీకేవీధి మండల కేంద్రంలో గిరిజన సహకార సంస్థ నిర్వహణలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకు మూతపడింది. ఇంధన నిల్వలు లేక రెండు రోజులుగా దీనిని సిబ్బంది మూసివేశారు. 15 పంచాయతీల ప్రజలకు ఈ బంకే ఆధారం. గతంలో జీసీసీ అధికారులు క్రెడిట్‌లో పెట్రోల్, డీజిల్ తీసుకొచ్చి విక్రయాలు జరిపేవారు. పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోల్, డీజిల్‌కి ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీంతో హెచ్‌పీ అధికారులు ముందుగా నగదు చెల్లిస్తేనే తప్ప పెట్రోల్, డీజిల్ ట్యాంకులు పంపించడం లేదు. జీసీసీ అధికారులు పెట్రోల్, డీజిల్‌కి నగదు చెల్లించకపోవడం వల్ల హెచ్‌పీ బంకు అధికారులు సరఫరాను నిలిపివేశారు. ప్రస్తుతం జీకేవీధి మండలంలో ప్రైవేటు వ్యాపారులు చింతపల్లి నుంచి డీజిల్, పెట్రోల్ తీసుకొచ్చి అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా జీసీసీ అధికారులు పెట్రోల్ బంకు సేవలను పునరుద్ధరించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.




# నేటి నుంచి ఐపీఎల్ సీజన్-19 ప్రారంభం



క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 19వ సీజన్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నమెంట్ మార్చి 28న అట్టహాసంగా ప్రారంభం కానుంది. భారత్‌లో ఈ టోర్నమెంట్‌ను స్టార్ స్పోర్ట్స్ ఛానెళ్లలో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. డిజిటల్ ప్రసార హక్కులను దక్కించుకున్న జియోహాట్‌స్టార్ తమ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో మ్యాచ్‌లను లైవ్ స్ట్రీమింగ్ చేయనుంది. ఐపిఎల్ సీజన్-19 పూర్తి షెడ్యూల్ విడుదలైంది. ఐదు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఏప్రిల్ 12వరకు మాత్రమే తొలి దఫా షెడ్యూల్‌ను విడుదల చేయగా.. టోర్నీ ప్రారంభానికి రెండ్రోజుల ముందు ఐపిఎల్ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) విడుదల చేసింది. దీంతో ఏప్రిల్ 13 నుంచి జరిగే ఐపిఎల్ రెండో దశ మ్యాచ్‌ల షెడ్యూల్ కూడా విడుదలైంది. టోర్నీ ప్రారంభానికి ముందు ఐపిఎల్ కెప్టెన్లతో బిసిసిఐ సమావేశమైంది. ఈ సమావేశంలో క్యాచ్‌ల రివ్యూలపై సుదీర్ఘ చర్చ నడించింది. అలాగే కాంకషన్ సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని కొనసాగిం చేందుకు ఫ్రాంచైజీలు విముఖత చూపడంతో ఈ సీజన్ నుంచి దానిని తొలగించారు.ఏప్రిల్ 13 నుంచి రెండో విడత లీగ్ జరగనుండగా మే 24న ఢిల్లీ-కోల్‌కతా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో సీజన్-19 లీగ్ మ్యాచ్‌లు ముగియనున్నాయి. ఆ తర్వాత జరిగే ప్లే ఆఫ్స్ తేదీలను బిసిసిఐ ఇంకా వెల్లడించలేదు. సీజన్-19 ప్రారంభానికి ముందు ఐపిఎల్ కెప్టెన్లతో బిసిసిఐ చిట్ చాట్ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశం అనంతరం బిసిసిఐ తొలి విడత ఐపిఎల్‌కు కొనసాగింపుగా రెండో దశ షెడ్యూల్‌ను వెల్లడించింది. రెండో దశలో 12 వేదికల్లో 50 మ్యాచ్‌లు జరుగుతాయని తాజా ప్రకటనలో పేర్కొంది. వీటిలో ఎనిమిది డబుల్ హెడర్స్ మ్యాచ్‌లు ఉంటాయని, మధ్యాహ్నం 3:30 గంటలకు ఒకటి, రాత్రి 7:30 గంటలకు రెండో మ్యాచ్ జరుగుతుందని ఫ్రాంచైజీలకు బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. రెండో దశలో తొలి మ్యాచ్ ఏప్రిల్ 13న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరుగుతుంది. పంజాబ్ కింగ్స్ జట్టు తమ హోమ్ మ్యాచ్‌లను న్యూ చంఢగీఢ్‌లో ఆడనుంది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు ధర్మశాలలో, రాజస్థాన్ సొంత గడ్డ అయిన జైపూర్‌లో నాలుగు మ్యాచ్‌లు జరుగుతాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ చిన్నస్వామి స్టేడియంలో మూడు, రారుపూర్‌లో రెండు మ్యాచ్‌లు ఆడనుంది. 28న చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఆరంభ మ్యాచ్ టికెట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. గత ఏడాది తొక్కిసలాట ఘటనతో మూత పడిన చిన్నస్వామి స్టేడియం దాదాపు పది నెలల తర్వాత తొలి మ్యాచ్‌కు సిద్ధం కానుంది. దీంతో ఈ స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పోటీపడి టికెట్లు కొనుగోలు చేశారు. సన్‌రైజర్స్ హైదారబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఆర్సీబీని రూ.16వేల కోట్లకు దక్కించుకున్న కొత్త యాజమాన్యం కర్నాటక క్రికెట్ సంఘంతో కలిసి మ్యాచ్‌ను విజయవంతం 40 వేల మంది సామర్థ్యమున్న స్టేడియంలో భద్రతా పర్యవేక్షణకు బెంగళూరు ఫ్రాంచైజీ అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది.

# ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించొద్దు: అశ్విన్



ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందు ఎంఎస్ ధోనీపై రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. చెన్నై సూపర్ కింగ్స్ అతడిని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడించొద్దని సూచించాడు. 'ధోనీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగడాన్ని నేను ఒప్పుకోను. అతడు ఒకవేళ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ఉంటే.. కచ్చితంగా ఆడాల్సిందే. ఆడొద్దు అనుకుంటే సీజన్ మొత్తం ఆడొద్దు' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా విశ్లేషించాడు. 'మీరు చెన్నై సూపర్ కింగ్స్ తుది జట్టును తయారుచేస్తుంటే.. అందులో ధోనీకి కచ్చితంగా స్థానం కల్పించాలి. ఒకవేళ అతడు ఆడొద్దు అనుకుంటే.. రిటైర్ అయిపోవాలి. అయితే తాను ఆడగలననే నమ్మకం అతడిలో 100శాతం ఉంది. ధోనీ మూడు నెలలుగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. దీనిద్వారా తాను ఆడగలననే సందేశాన్ని ఇస్తున్నాడు. ఒకవేళ అతడు ఆడాలనుకుంటే.. నువ్వు ఆడటం కుదరదు.. అని ధోనీతో చెప్పడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ప్రతిసారీ టాపార్డర్ పరుగులు రాబట్టలేదు. అతడు కాస్త ముందే బ్యాటింగ్‌కు వచ్చి ఉండాల్సింది. అయితే ఈసారి మాత్రం ఆ పరిస్థితి లేదు. వారు టాపార్డర్‌ను పటిష్టం చేసుకున్నారు. ఈ సీజన్‌లోనూ ధోనీ ఒకటి, రెండు మ్యాచుల్లో మాత్రమే కాస్త ముందు బ్యాటింగ్‌కు వస్తాడేమో. దాదాపు అన్ని మ్యాచుల్లోనూ చివర్లోనే బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. కీపింగ్‌పై అతడు ప్రధానంగా దృష్టి సారిస్తాడు. ఫీల్డ్ సెట్టింగ్‌లో కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు మార్గనిర్దేశం చేస్తాడు. మొత్తానికి ధోనీ సీఎస్కేకి పెద్దన్న పాత్ర పోషిస్తాడు' అని అశ్విన్ వెల్లడించాడు.




# ‘బ్యాండ్ మేళం’

## మూవీ రివ్యూ

‘కోర్ట్’ చిత్రంతో అలరించిన జంట హర్ష రోషన్, శ్రీదేవి ముఖ్యతారలుగా నటించిన తాజా చిత్రం ‘బ్యాండ్ మేళం’. పలు విజయవంతమైన చిత్రాలకు రచయితగా పనిచేసిన కోన వెంకట్ తన నిర్మాణ సంస్థలో ఈ చిత్రాన్ని నిర్మించాడు. ‘కోర్ట్’ చిత్రంతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ యువ జంటకు ‘బ్యాండ్ మేళం’ మూవీ సక్సెస్‌ను అందించందా? సినిమాలో ప్రేక్షకులను అలరించే అంశాలున్నాయా? లేదా అనేది చిత్ర సమీక్షలో తెలుసుకుందాం.. గిరి (హర్ష రోషన్) తనకు చదువు సరిపడదని చదువును మధ్యలోనే మానేసి సంగీత దర్శకుడు అవ్వాలనే కోరికతో ఫ్రెండ్స్‌తో కలిసి ఓ బ్యాండ్ బ్యాచ్‌ను రన్ చేస్తుంటాడు. గిరి మరదలు రాజీ (శ్రీదేవి) చదువులో టాపర్‌గా ఉంటుంది. ఈ ఇద్దరికి పెద్దయ్యాక పెళ్లి చేయాలని ఇరువురి తల్లిదండ్రులు చిన్నప్పుడే నిర్ణయించుకుంటారు. కానీ పరిస్థితులు మారిపోవడం. దీనికి తోడు గిరి చదువుకోకుండా, ఎటువంటి లక్ష్యం లేకుండా ఉండటంతో రాజీ కూడా గిరిని దూరం పెడుతుంది. కానీ గిరి మాత్రం రాజీ తనకు కాబోయే భార్య అని అందరికి చెప్పుకొంటుంటాడు. కానీ రాజీ తండ్రి, సాయన్న (సాయికుమార్) ఓ పెళ్లి సంబంధం చూసి రాజీకి పెళ్లి చేయాలని అనుకుంటాడు. ఈ సమయంలో రాజీ ఏం చేసింది? రాజీ, గిరిల పెళ్లి జరిగిందా? గిరి తన మరదలు మనసు గెలిచాడా? లేదా? సంగీత దర్శకుడిగా ఎదగాలనే అతని కల ఫలించిందా? లేదా తదితర విషయాల్ని వెండితెరపై చూసి తెలుసుకోవాల్సిందే. బావ మరదళ్ల ప్రేమకథతో ఇప్పటి వరకు తెలుగులో చాలా సినిమాలొచ్చాయి. ఆ నేపథ్య కథతో వచ్చిన ఈ సినిమా చూస్తుంటే ప్రతి సన్నివేశంలో ఆ పాత సినిమాలే గుర్తొస్తాయి. ఏ మాత్రం కొత్తదనం లేని రోటిన్ కథతో, బలహీనమైన సన్నివేశాలతో, అలరించని పాత్రలతో రూపొందించిన సినిమా ఇది. కథ, కథనాలు ఎంతో రోటిన్‌గా బోరింగ్‌గా అనిపిస్తాయి. సినిమా ప్రారంభం నుంచే అందరిలో ఈ పీల్ కలుగుతుంది. ఓ కొత్త తరహా కథతో, ఓ కొత్త సన్నివేశంతో ప్రేక్షకులను అలరించాలనే తపన మచ్చుకు కూడా సినిమాలో కనిపించదు. హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలతో పాటు ప్రతి సీన్ భారంగా నడుస్తుండటంతో సినిమా ఆద్యంతం ఎక్కడా కూడా ఆసక్తిని కలిగించదు. తొలిభాగం సహనానికి పరీక్షగా నిలిస్తే.. రెండో భాగం చూడాలని ఓపికగా థియేటర్‌లోనే ఉన్నవాళ్లకు ఇంటర్వెల్ తరువాత వచ్చే సన్నివేశాలు కూడా అంతకు మించిన పరీక్షగా మారిపోతాయి. ఈ చిత్రంలో పాత్రలు కూడా సరైన రీతిలో దర్శకుడు తీర్చిదిద్దలేదు. హీరో, హీరోయిన్లు, ఇతర పాత్రలు మాట్లాడే తెలంగాణ యాస సహజంగా అనిపించదు. ‘కోర్ట్’ ద్వారా రోషన్, శ్రీదేవిల జంటకు వచ్చిన క్రేజ్‌తో ఇమ్మీడియట్ మరో సినిమా తీసేయాలనే హడావుడే తప్ప, ఓ మంచి సినిమాను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశం మేకర్స్‌లో ఉన్నట్లుగా కనిపించలేదు. ‘కోర్ట్’ సినిమాలో టీనేజ్ జంటగా అలరించిన ఈ జంట పాత్రలు ఈ సినిమాలో సరైన రీతిలో తీర్చిదిద్దకపోవడంతో రెండూ పాత్రలు ఆకట్టుకునేల లేవు. గిరిగా హర్ష్ రోషన్ నటన పరిధి మించిన విధంగా కనిపిస్తుంది. చాలా చోట్ల ఆయన డైలాగ్ డెలివరీ, నటన, హావాభావాలు శ్రుతి మించినట్లుగా అనిపిస్తుంటాయి.శ్రీదేవి పాత్ర కూడా అంతగా ఆకట్టుకోదు. కథ, కథనంలో బలం లేకపోవడంతో ఏ పాత్ర కూడా అలరించే విధంగా లేదు. విజయ్ బుల్గానిస్ సంగీతం ఆయన మార్క్‌లో లేదు, రచయితగా ఎన్నో విజయవంతమైన చిత్రాలకు కథను అందించిన కోన వెంకట్ ఇలాంటి నాసిరకం కథతో, నీరసమైన సన్నివేశాలతో ఇలాంటి సినమా తీయడం అందరిని ఆశ్చర్యపరుస్తుంది. దర్శకుడు సతీష్ జవ్వాజి ఏ విషయంలో కూడా తన ప్రతిభను చూపలేకపోయాడు. సినిమాలో కొత్తదనం కోసం రచన బృందం కనీసం ప్రయత్నించినట్లుగా అనిపించదు. బలహీనమైన కథ, కథనాలతో ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టిన ‘బ్యాండ్ మేళం’ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో విఫలమైంది.



# కళ్యాణ్‌రామ్‌కు జోడిగా కృతిశెట్టి



దర్శకుడు అనిల్ రావిపూడి మరో మల్టీ స్టారర్‌ను తెరకెక్కించటానికి ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో వెంకటేష్- కళ్యాణ్‌రామ్ కథానాయకులు. వీరికి జోడీకి కథానాయికల ఎంపికకు అనిల్‌రావిపూడి కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. వెంకటేష్‌కి జోడీగా కీర్తీ సురేష్ ఎంపిక ఖాయమైనట్లుగా సమాచారం. కళ్యాణ్‌రామ్‌కి జోడీగా నటించ నున్న హీరోయిన్ల జాబితాలో కృతీశెట్టి, కయాదు లోహర్ పేర్లు ఉన్నాయి. కృతీశెట్టి పేరు ఫైనలయ్యే అవకాశం ఉంది. ‘డ్రాగన్, అల్లూరి, ఫంకీ’ చిత్రాల ఫేమ్ కయాదు లోహర్ పేరు కూడా తెరపైకి వచ్చింది. ఈ సినిమా 2027 సంక్రాంతికి విడుదల కానుంది.







# పెళ్లిపై నాకు మంచి అభిప్రాయం లేదు: సాయిపల్లవి

టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సంపా దించుకున్న సాయిపల్లవి... పెళ్లి గురించి, తన వ్యక్తిగత భావో ద్వేగాల గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడి యాలో వైరల్ అవుతున్నాయి. తనకు పెళ్లిపై పెద్దగా మంచి అభిప్రాయం లేదని ఆమె తెలిపింది. పెళ్లైన వారు కూడా పెళ్లి చేసుకోవద్దని తనకు సల హా ఇస్తున్నారని చెప్పింది. అం దుకే తనకు పెళ్లి చేసు కోవాలనే ఆలోచన లేదని తెలి పింది. ఒంటరిగానే తాను చాలా ప్రశాంతంగా ఉన్నానని, ప్రస్తుతం తన దృష్టంతా సిని మాలపైనే ఉందని స్పష్టం చేసింది.

అయితే, అర్ధరాత్రి పూట ఏమీ తినకుండా ఏడుస్తూ కూర్చునే అలవాటు ఉందని తెలిపింది. ఆ సమయంలో కేవలం తన తల్లి మాత్రమే తనకు తోడుగా ఉంటుందని చెబుతూ ఆమె ఎమోషనల్ అయ్యారు. దీంతో, బయ టకు ఎంతో నవ్వుతూ కని పించే సాయి పల్లవి మనసులో ఇంతటి సున్ని తత్వం, ఏదో తెలియని బాధ ఉన్నాయా? అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**